ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY


కాకినాడ

జిల్లా వార్తలు

శుక్రవారం 11 ఏప్రిల్ 2025 | 5



అబ్బురపరచిన త్రివిధ దళాల విన్యాసాలు

- కాకినాడ సముద్ర తీరంలో టైగర్ ట్రయింఫ్

7

వ్యాపారి కిడ్నాప్ కలకలం






తునిలో గురువారం జరిగిన సభలో యనమలను సత్కరిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మంత్రులు అచ్చెన్నాయుడు, అనిత, టీడీపీ రాష్ట్రాధ్యక్షుడు పల్లా శ్రీనివాస్.. హాజరైన జనం

విజ్ఞాన గని.. యనమల

- సుదీర్ఘ రాజకీయ నేతగా ఎన్నో విలువలు నెలకొల్పారు
- సంక్షోభాలు, ఒడిదుడుకుల్లోనూ చెక్కుచెదరని నేత
- కొనియాడిన శాసనసభ స్పీకర్, మంత్రులు, ఎమ్మెల్యేలు
- తునిలో యనమల 42 ఏళ్ల రాజకీయ ప్రస్థాన సభ

తెలుగుదేశం పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు 42 ఏళ్ల రాజకీయ ప్రస్థాన సభ గురువారం తునిలో ఘనంగా జరిగింది. శాసన సభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, పలువురు మంత్రులు హాజరైన ఈ సభలో పుస్తకావిష్కరణతో ఫొటో గ్యాలరీలను ఏర్పాటుచేశారు. 7





- ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో భూముల రీసర్వే
- 48 గ్రామాల్లో 52,280 మందికి నోటీసులు జారీ
- 21రోజుల్లో నోటీసులకు బదులివ్వాలి
- అభ్యంతరాల స్వీకరణ తర్వాత జేసీ లాగిన్‌కు నివేదిక
- జేసీ ఆధ్వర్యంలో రీ సర్వే నివేదిక తుది ప్రచురణ
- 15 నుంచి 46 గ్రామాల్లో రెండో విడత భూముల రీసర్వే

తొలి విడత తేలింది!

కలెక్టరేట్(కాకినాడ), ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): రైతులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న భూముల రీసర్వే క్రతువు కొలిక్కి వస్తోంది. తొలి విడతగా 48 గ్రామాల్లో భూముల రీసర్వే నిర్వహించి రైతులకు నోటీసులు జారీచేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో తొలి విడత (పైలెట్ ప్రాజెక్ట్)గా 48 గ్రామాల్లో భూముల రీసర్వే నిర్వహించాలని అధికార యంత్రాంగం నిర్ణయించింది. దీనిలో కాకినాడ జిల్లాలో 15 గ్రామాల్లో, కోనసీమ జిల్లాలో 17, తూర్పుగోదావరి జిల్లాలో 16 గ్రామాల్లో రీసర్వేకు ఎంపిక చేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో నిర్వహించిన తొలి విడత సర్వేలో మూడు నెలలపాటు అంటే జనవరి 10వ తేదీ నుంచి ఏప్రిల్ 8వ తేదీ వరకు అధికార బృందాలు పాల్గొన్నాయి. 250 ఎకరాలను ఒక బ్లాక్‌గా విభజించి సర్వే చేశారు. ప్రతి గ్రామంలో వ్యవసాయ భూముల విస్తీర్ణాన్ని బట్టి నాలుగు బృందాలుగా విభజించారు. ఇద్దరు సర్వేయర్లు, ఒక వీఆర్వో, ఒక వీఆర్‌ఏలు ఒక బ్లాక్‌ను సర్వే చేశారు. ఇలా బృందాలు నిత్యం రీసర్వేలో పాల్గొన్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో ఆదరాబాదరాగా భూముల సర్వే చేశారు. ఈ నేపథ్యంలో భూముల విస్తీర్ణం తగ్గిందని, హద్దులు మార్చేశారని, హక్కు పత్రాల్లో తప్పులు దొర్లాయని పెద్దఎత్తున రైతులు అధికారులకు ఫిర్యాదులు చేశారు. దీంతో రాష్ట్రప్రభుత్వం భూముల రీసర్వేకు ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో భూముల రీసర్వే నిర్వహించారు.

తూర్పుగోదావరి జిల్లాలో..

తూర్పుగోదావరి జిల్లాలో తొలి విడతలో 16 గ్రామాల్లో భూముల రీసర్వే చేశారు. 19 వేలమంది రైతులకు నోటీసులు జారీచేశారు. క్షేత్రస్థాయిలో భూముల సరిహద్దు కొలిచి ఏ మేరకు హక్కు పత్రాల్లో ఉన్నాయో గుర్తించారు.



కరపలో రీసర్వే చేస్తున్న దృశ్యం (ఫైల్‌ఫొటో)

కాకినాడ జిల్లాలో...

కాకినాడ జిల్లాలో తొలి విడతలో 15 గ్రామాల్లో భూముల రీసర్వే నిర్వహించారు. దీనిలో వేట్లపాలెం, కోలంక, కుమారపురం, పటవల, యల్లమిల్లి, జె.కొత్తూరు, ఎస్.తిమ్మాపురం, బోదవరం, కట్టమూరు, పి.జగన్నాధపురం, ఆర్.వెంకటపురం, శంఖవరం, కృష్ణపురం, భద్రవరం గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాల్లో వ్యవసాయ పొలాలను రెవెన్యూ బృందాలు రీసర్వే నిర్వహించాయి. ఇటీవల 27 వేల మందికి 92 నోటీసులు జారీచేశారు. మరో 21 రోజుల్లో అభ్యంతరాలను స్వీకరిస్తారు.

అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో..

అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో తొలి విడతలో 17 గ్రామాల్లో భూముల రీసర్వే నిర్వహించారు. దీనిలో జొన్నాడ, వాడపల్లి, కొడగట్లపల్లి, ఓడరేవులపల్లి, భీమక్రోసుపాలెం, ముమ్మిడివరప్పాడు, అప్పన్నరామునిలంక, మట్టపర్రు, గాడిలంక, పశువులంక, ఉప్పలగుప్తం, ఎంట్రికోన, కందికుప్ప, నందంపూడి, వానపల్లి గ్రామాల్లో రీసర్వే నిర్వహించారు. 5,280 మంది రైతులకు 92 నోటీసులు జారీచేశారు.

తొలి విడత రీసర్వే నివేదిక

తొలి విడత భూముల రీసర్వే నోటీసులకు అభ్యంతరాలు స్వీకరించిన తర్వాత నివేదిక తహసీల్దార్ లాగిన్ నుంచి ఆర్డీవో లాగిన్‌కు వెళ్తుంది. అక్కడి నుంచి జిల్లా జాయింట్ కలెక్టర్ల లాగిన్‌కు వెళుతుంది. జాయింట్ కలెక్టర్ పరిశీలించిన తర్వాత ఆయా గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తారు. అక్కడ ఎలాంటి అభ్యంతరాలు లేని రీసర్వే నివేదికను తుది ప్రచురణ చేసి ఆమోదిస్తారు. ఈ నేపథ్యంలో రైతులు ఎంతోకాలంగా పరిష్కారం కాని భూముల హద్దులు, దొర్లిన తప్పుల సమస్యలు ప్రభుత్వం పరిష్కరించనుంది.

15 నుంచి రెండో విడత..

ఈనెల 15 నుంచి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 46 గ్రామాల్లో రెండో విడత భూముల రీసర్వేకు యంత్రాంగం సిద్ధమవుతోంది. దీనిలో కాకినాడ జిల్లాలో 14 గ్రామాల్లో, కోనసీమ జిల్లాలో 15 గ్రామాల్లో, తూర్పుగోదావరి జిల్లాలో 17 గ్రామాల్లో రీసర్వేకు సర్వం సిద్ధమైంది. రెవెన్యూ బృందాలు, సర్వేయర్ల బృందాలను అధికారులు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు.

దరఖాస్తులకు పరిష్కారం

గత వైసీపీ ప్రభుత్వం చేసిన తప్పులకు రైతులు నిండా మునిగారు. ఈ పది నెలల కాలంలో మూడు జిల్లాల్లో నిర్వహించిన గ్రామసభలకు, కలెక్టరేట్‌లకు వేలాది సంఖ్యలో కుప్పలు తెప్పలుగా దరఖాస్తులు వచ్చాయి. దీంతో అధికారులూ తీవ్ర ఒత్తిడికి గురయ్యారు. ప్రభుత్వం రీసర్వేకు ఆదేశించడంతో రైతులకు ఊరట కలగనుంది.

రమ్మీ.. జీవితం దమ్మీ!



- పొలం అమ్మి ఆన్‌లైన్ రమ్మీలో రూ.కోటీ 40 లక్షలు పోగొట్టుకున్న వైనం
- ఆపై పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్యాయత్నం
- యథేచ్ఛగా రమ్మీ ఆన్‌లైన్ గేమ్.. ఎక్కడ చూసినా ఆన్‌లైన్ పేకాటే
- బానిసలైపోతున్న యువతరం.. ఇదో రకం లూటీ
- రోడ్డునపడుతున్న కుటుంబాలు.. నియంత్రణ సాధ్యమేనా

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్10 (ఆంధ్రజ్యోతి) : అతడిది కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం రామన్నపాలెం. ఉప్పాడ సెంటర్లో వాహనాల స్పేర్‌పార్టుల వ్యాపారం. తండ్రికి ఉన్న 90 సెంట్ల పొలాన్ని రూ.కోటి36లక్షలకు విక్రయించాడు. ఈ సొమ్ముతో వేరేచోట పొలం కొనాలి. కానీ ఆన్‌లైన్ రమ్మీ గేమ్‌లో ఈ మొత్తం సొమ్ముతోపాటు మరో రూ.4లక్షలు సైతం దఫదఫాలుగా ఆడి పోగొట్టుకున్నాడు. దీంతో ఈనెల 8న పురుగుమందు తాగేశాడు. వెంటనే కాకినాడలో ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. అప్పుడు అసలు విషయం వెలుగుచూసింది. ఈ తరహాలోనే ఆన్‌లైన్ రమ్మీ క్యాష్ గేమ్స్‌లో ఆడి లక్షలాది రూపాయలు పోగొట్టుకున్నవారు, ఇళ్లు, పొలాలు అమ్మి మరీ ఆడిన వారు, కళాశాలల్లో ఈ గేమ్‌కు బానిసలై చదువులు అటకెక్కినవారు కోకొల్లలుగా వెలుగులోకి వస్తున్నాయి. నిజానికి పేకాట ఆడటం నేరం. ఎక్కడైనా పేకాట ఆడితే వారిని పోలీసులు అరెస్టు చేసి కేసు నమోదు చేస్తారు. కానీ అదే పేకాట ఆన్‌లైన్‌లో ఆడితే కేసులు ఉండవు. ఇదే అదునుగా సరదాగా ఆడుకున్న రమ్మీ ఆటను పెద్ద జూదంగా మార్చేశారు. ఇంట్లో, ఆఫీసుల్లో, బస్టాండుల్లో, రెస్టారెంట్లలో, పార్కుల్లో, ఇంట్లో ఖాళీగా ఉన్న సమయంలో రాత్రి పగలూ తేడా లేకుండా ఆన్‌లైన్‌లో రమ్మీ పేకాట ఆడేస్తున్నారు. వీటిని నియంత్రించే పరిస్థితి కూడా లేదు. వాస్తవానికి పేకాట ఆన్‌లైన్‌లో ఆడటం కూడా అధికారికంగా కుదరదు. కానీ కొంతమంది ఈ పేకాటను ఎక్కడో గోవా, చెన్నై, హైదరాబాద్, విశాఖపట్నం, ముంబై, కలకత్తా, పంజాబ్, ఢిల్లీ వంటి ప్రాంతాల నుంచి ఆపరేట్ చేస్తూ ఆన్‌లైన్‌లో రమ్మీని ఆడిస్తూ కోట్లాది రూపాయలు లాగేస్తున్నారు. రమ్మీలో తొలుత డబ్బులు వచ్చేలా చేసి అలవాటు చే



యడం ద్వారా ఆటగాళ్లకు వలవిసురుతారు. ఈ వలలో పడ్డ ఆటగాడు విలవిల కొట్టుకుని చివరికి అప్పులు పాలై ఊరువదిలి పెట్టి పారిపోయే పరిస్థితి. ముఖ్యంగా యువత ఈ రమ్మీ గేమ్‌ల వైపు ఆసక్తి చూపడం ఆందోళన కలిగిస్తోంది. దీంతో తొలుత చిన్న ప్రారంభమైనా క్రమేపీ లక్షల్లోకి ఈ గేమ్ వెళ్లిపోతుంది. దీనికి మళ్లీ కొంతమందితో ప్రమోట్ చేయించడంతో చాలామంది యువత ఈ ఉచ్చులోకి దిగుతున్నారు. యువతతోపాటు పెద్దవాళ్లు కూడా ఈ ఆటలకు బానిసలు కావడం విస్మయానికి గురిచేస్తోంది. ఆన్‌లైన్‌లో రమ్మీ పేకాట పక్కా ప్లాన్ ప్రకారం జరుగుతుంది. కొంతమంది సాముహాన్ని ఒకచోట కేంద్రీకృతం చేసి వారు కార్డులను వారికి ఓపెన్‌గా చూసుకుని గేమ్ ఆడి దానిని ఆ గ్యాంగ్‌లోని వారే షో కొట్టేవిధంగా వ్యూహత్మకంగా ఇది నడుస్తుంది. దీనివల్ల వివిధ ప్రాంతాల నుంచి ఆడేవారంతా నష్టపోతారు. నగదు అంతా ఈ గేమ్ నిర్వహించే ముఠాకే వెళ్లిపోతుంది. దీన్ని ఆధారాలతో పట్టుకునే వారే ఉండరు. ఆన్‌లైన్ పేకాటలు, బెట్టింగ్ యాప్‌లపై ఎటువంటి ఫిర్యాదు ఉండడంలేదు. దీనికి కారణం ఆన్‌లైన్ జూదంలో సొమ్ములు పోగొట్టుకున్నామని చెప్పుకోలేరు. ఒకవేళ చెబితే తొలుత చట్టప్రకారం చర్యలు తీసుకుంటారు కాబట్టి దాంతో విషయం వెలుగుచూసే అవకాశం ఉండదు. ఈ తరుణంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆన్‌లైన్ జూద క్రీడలపై కఠిన చర్యలు తీసుకోకపోతే మరెన్నో కుటుంబాలు రోడ్డునపడతాయి.



భారీగా నొక్కేశారు!



2024, మార్చిలో మహాశివరాత్రి సమయంలో ఉప్పాడ బస్టాండ్ నుంచి ఫైర్‌స్టేషన్ సెంటర్ వరకూ వైసీపీ రంగుల్లో వేసిన ఎల్ఈడీ సీరియల్ లైట్లు. దీనికి రూ.5లక్షలు వ్యయం అయిందని చూపారు

- పనులు చేయకుండానే బిల్లుల చెల్లింపు
- దాతలు చేసిన పనులకు మునిసిపల్ సొమ్ములు
- ఒకే పనికి రెండు, మూడుసార్లు బిల్లులు
- ముందు నిధులు డ్రా చేసి తర్వాత తూతూమంత్రంగా పనులు
- పిఠాపురంలో 2023, 24ల్లో రూ.కోటికిపైగా నిధులు పక్కదారి

అందినకాడికి దోచుకున్నారు. ఇంజనీరింగ్ అధికారుల మాయాజాలంతో మునిసిపల్ నిధులకు గండి పడింది. పనులు చేయకుండానే బిల్లులు చెల్లింపు, వాస్తవంలో జరిగిన పనికంటే అధికంగా సొమ్ములు ముట్టచెప్పడం, నిర్దేశించిన ప్రాంతంలో కాకుండా వేరే ప్రాంతాల్లో పనులు చేయడం, దాతలు చేసిన పనులకు మునిసిపల్ సొమ్ములు చెల్లించడం ఇలా వీలున్న చోటల్లా సొమ్ములు పక్కదారి పట్టించారు. ఇందులో అధికారులతోపాటు వైసీపీ పురపాలకుల హస్తం ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

(ఆంధ్రజ్యోతి-పిఠాపురం)

పిఠాపురం పురపాలక సంఘ పరిధిలో రూ.కోటికి పైగా నిధులు పక్కదారి పట్టాయి. అభివృద్ధి పనుల పేరుతో అవకాశం ఉన్నచోటల్లా నిధులు లాగేశారు. పనులు చేయకుండా, చేసిన పనికి రెండు,మూడుసార్లు బిల్లులు పెట్టడం, ఆమోదించిన అంచనాల్లో పేర్కొన్న చోట పనులు నిర్వహించకపోవడం, అంచనాలను 100నుంచి 400శాతం పెంచి చూపించడం వంటివి చేసి 2023-24 సంవత్సరంతోపాటు అంతకుముందు సంవత్సరాల్లో నిధులు పక్కదారి పట్టించారు. ఇప్పటికే పలు పనుల నిర్వహణపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, కాకినాడ మునిసిపల్ కార్పొరేషన్ ఈఈలు నిర్వహించిన విచారణలోను లోపాలు వెలుగుచూశాయి. దాతలు చేసిన పనులకు ఇంజనీరింగ్ అధికారులతో అంచనాలు రూపొందించుకుని నిధులు డ్రా చేశారు. 14, 15వ ఆర్థిక సంఘాలతో మంజూరైన పనుల్లో కొన్నింటిని పనులు చేయకుండానే ఎంబుక్‌లు రికార్డు చేసి బిల్లులు డ్రా చేసిన అధికారులు, ఆపై దానిపై ఫిర్యాదులు, సమాచార హక్కు చట్టం ద్వారా వివరాలు కోరడం తో తూతూమంత్రంగా పనులు నిర్వహించారు. వైసీపీ పురపాలకుల అండతో ఇంజనీరింగ్ అధికారులు ఇలా చేసినట్లు ఆరోపణలున్నాయి.

స్వయంగా ఆమోదించే అధికారంతో..

కమిషనర్ రూ.50వేలలోపు పనులను కౌన్సిల్ దృష్టికి తీసుకురాకుండా స్వయంగా ఆమోదించి వాటికి చెల్లింపులు జరిపే అధికారం ఉంది. దీన్ని ఆసరాగా చేసుకుని గతంలో పనిచేసిన ఇద్దరు కమిషనర్లు ఇంజనీరింగ్ అధికారుల సహకారంతో బిల్లులు డ్రా చేశారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఈ విధంగా రూ.30లక్షల వరకూ వివిధ బిల్లులు పెట్టి నిధులు డ్రా చేసినట్లు ఆరోపణలున్నాయి. ఇందులోనూ ఇంజనీరింగ్ అధికారులదే కీలకపాత్ర. పట్టణంలోని నాలుగో వార్డు వైఎస్ఆర్ గార్డెన్స్‌లో పాత్ హోల్ ఫిల్లింగ్ కార్యక్రమం కింద పనులు చేపట్టేందుకు గాను రూ.4.50లక్షలు మంజూరు కాగా, ఆ నిధులను అప్పటి మునిసిపల్ ఏఈ ప్రభాకరరావుకు అడ్వాన్స్‌గా ఇచ్చారు. దీన్ని సకాలంలో ఎంబుక్‌లో రికార్డు చేయకపోవడం, పనులు నిర్వహించిన వారికి చెల్లింపులు జరపకపోవడాన్ని ప్రస్తావిస్తూ ఈ వ్యవహారంలో నిధులు దుర్వినియోగం జరిగినట్లు కాకినాడ మునిసిపల్ కార్పొరేషన్ ఈఈ వెంకట్రావు గుర్తించారు.

విధులకు హాజరు కాని అధికారులు

అభివృద్ధి పనులకు బిల్లుల చెల్లింపు వ్యవహారంలో పలు ఆరోపణలు రావడం, వీటిపై విచారణ జరిగి కొన్ని నిర్ధారణ అయిన నేపథ్యంలో ఇంజనీరింగ్ అధికారుల్లో కలవరం మొదలైంది. మునిసిపల్ ఏఈ రత్నవల్లి నవంబరు నెల నుంచి దీర్ఘకాలిక సెలవు పెట్టారు. ఆమె అప్పటినుంచి విధులకు హాజరు కాలేదు. మునిసిపల్ డీఈఈ భవానీశంకర్ 45రోజులుగా కార్యాలయానికి హాజరు కావడం లేదు.

ఇలా జరిగాయి..

- పిఠాపురం పట్టణంలోని జగ్గయ్యచెరువుకాలనీలో పైప్‌లైన్ ఏర్పాటుకు 15వ ఆర్థిక సంఘం ద్వారా రూ.5లక్షలు మంజూరు కాగా, ఆ నిధులు పనులు చేసినట్లు ఎంబుక్ రికార్డు చేసి నిధులు డ్రా చేశారు. 2023లో ఈ వ్యవహారం జరగ్గా బిల్లుల చెల్లింపునకు సిఫారసు చేసిన ఏఈఈ, డీఈఈలు, చెల్లింపులు చేసిన అప్పటికమిషనర్‌ను బాధ్యులుగా గుర్తించారు.
- పట్టణంలోని 19వవార్డులో మసీద్‌మాన్యం దగ్గర్లోని మునిసిపల్ బరియల్ గ్రౌండ్‌ను మట్టి, గ్రావెల్‌తో ఎత్తు చేయడానికిగాను 2023, జూలై 31న జరిగిన మునిసిపల్ సమావేశంలో రెండు పనుల కింద రూ.10లక్షలకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. అప్పటికే ఆ పనులను దాతల సహాయంతో పూర్తి చేశారు. ఇదే విషయాన్ని ఆ రోజున జరిగిన కౌన్సిల్ సమావేశంలో కోఆప్షన్ సభ్యుడు చెప్పారు. కౌన్సిల్ ఆమోదంతోపాటు బిల్లులు చెల్లించేశారు.
- పట్టణంలో 2024, మార్చిలో జరిగిన మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా ఉప్పాడ బస్టాండ్‌నుంచి ఫైర్‌స్టేషన్ వరకూ వారంపాటు వైసీపీ రంగుల్లో ఎల్ఈడీ సీరియల్ దీపాల రూ.5లక్షలతో అంచనాలు రూపొందించి కౌన్సిల్ ఆమోదం తీసుకున్నారు. వీటికి రూ.50 వేల నుంచి రూ.లక్ష కూడా ఖర్చవ్వదు.
- పిఠాపురం పట్టణంలోని డ్రైవర్స్‌కాలనీలో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.12లక్షలతో పైప్‌లైన్ ఏర్పాటుకు ఆమోదం లభించగా పనులు జరిగినట్లు మునిసిపల్ ఏఈఈ, డీఈఈలు 2023లో ఎంబుక్‌రికార్డు చేసి బిల్లులు చెల్లింపునకు సిఫారసు చేయగా అప్పటి కమిషనరు ఆమోదం తెలిపారు. దీనిపై విచారణ చేయగా ఆమోదించిన అంచనాల్లో పేర్కొన్న చోట పనిజరగలేదని గుర్తించారు. దీంతో చివరి క్షణంలో బిల్లుల చెల్లింపును నిలిపివేశారు.
- ఎల్ఈడీ లైట్ల నిర్వహణకు మునిసిపల్ కౌన్సిల్ 2023, డిసెంబరు 30, 2024 ఫిబ్రవరి 28న నిర్వహించిన సమావేశాల్లో రూ.15లక్షలు మంజూరు చేసింది. ఆ నిధులతో చేపట్టిన పనులనే మరోమారు నిర్వహించినట్లు, ఇతర పనులు చేసినట్లు చూపించి 49పనులకుగాను రూ.23.13లక్షలు చెల్లించాలని ఇంజనీరింగ్ అధికారులు బిల్లులు పెట్టారు. వీటిపై ఆరోపణలు రావడంతో చెల్లింపులు నిలిపివేశారు.
- ఇవేగాక డ్రెయిన్లల్లో పూడికలు తొలగింపులు, వీఐపీల పర్యటన సమయాల్లో పట్టణంలోని ముఖ్యప్రాంతాల్లో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని ఎక్స్‌కవేటర్లతో తొలగించినట్లు, సమావేశాల నిర్వహణకు టెంట్లు ఏర్పాటు, ఇతరత్రా పనుల పేరుతో బిల్లులు పెట్టి నిధులు డ్రాచేశారు. వాటర్‌వర్క్స్ నిర్వహణలోను అవకతవకలు జరిగాయి.

ఇంజనీర్ ఇన్ చీఫ్‌కు నివేదిక పంపాను

ఇంజనీరింగ్ విభాగంలో జరుగుతున్న వ్యవహారాలపై పబ్లిక్‌హెల్త్ ఇంజనీరింగ్ ఇన్ చీఫ్‌కు నివేదిక పంపినట్లు మునిసిపల్ కమిషనర్ నామా కనకారావు ఆంధ్రజ్యోతికి తెలిపారు. మునిసిపల్ డీఈఈ భవానీశంకర్, ఏఈఈలు ఎన్.ప్రభాకరరావు, కె.రత్నవల్లిలు బిల్లులు అసంపూర్తిగా పెట్టడంతోపాటు పరిశీలన చేయకుండానే చెల్లింపులకు సిఫారసు చేయడాన్ని గమనించినట్లు చెప్పారు. దీనిపై విచారణ జరిపించగా పలు పనులు జరగనట్లు గుర్తించామని తెలిపారు. దీనిపై తగు చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను కోరామని చెప్పారు.

-కనకారావు, పిఠాపురం మునిసిపల్ కమిషనరు

మేనరికం వివాహాలను రూపుమాపేందుకు కృషిచేయాలి



- కలెక్టర్ షాన్‌మోహన్
- ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు ఉపకరణాల పంపిణీ

ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఉపకరణాల కిట్లను పంపిణీ చేస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్

కాకినాడ రూరల్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): పిల్లల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని మేనరికం వివాహాలను రూపు మాపేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ సూచించారు. కాకినాడ సాలిపేటలోని మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో జిల్లా పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాలుగల విద్యార్థులకు ఉపకరణాల పంపిణీ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టర్ షాన్‌మోహన్ ముఖ్యఅతిథిగాను, అతిథులుగా ఆర్జేడీ జి.నాగమణి, డీఈవో పి.రమేష్, సమగ్ర శిక్ష పీవో పి.వేణుగోపాలరావు, సీఎంవో, ఐఈ సమన్వయకర్త చామంతి నాగేశ్వరరావు, విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల శాఖ ఇన్‌చార్జి ఏడీ, జడ్పీ సీఈవో లక్ష్మణరావు ప్రత్యేక అవసరాలుగల విద్యార్థులకు వీల్‌చైర్స్, ట్రైసైకిల్స్, వినికిడి యంత్రాలు, టీఎల్ఎం, బ్రైలీ కిట్లు వంటి ఉపకరణాలను పంపిణీ చేశారు. కాన్పూర్‌లోని ఆలిమ్‌కో సంస్థ, సమగ్ర శిక్ష ద్వారా జిల్లాలో ఇప్పటివరకూ అనేక సందర్భాల్లో ప్రత్యేక క్యాంపులు నిర్వహించి రూ.3కోట్ల విలువైన పరికరాలను సంస్థ ద్వారా ఉచితంగా పంపిణీ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఆర్జేడీ నాగమణి మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఉన్న 272మంది ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు 34రకాల విలువైన ఉపకరణాలను పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు సీహెచ్ రవి, కేవీ సత్యనారాయణ, బి.శివ ప్రసాద్, పైడిరాజు,ఉమామహేశ్వరి, జోగిరెడ్డి పాల్గొన్నారు.

కుళాయిలకు అక్రమంగా మోటార్లు బిగిస్తే చర్యలు: కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ),ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): తాగునీటి కుళాయిలకు అక్రమంగా మోటార్లు బిగించి కృత్రిమ నీటి కొరత సృష్టిస్తున్న గృహాల పైపులైన్లను కట్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. కాకినాడ కలెక్టరేట్‌లో గురువారం ఎంపీడీవోలు, డ్వామా ఏపీవోలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్నిగ్రామాల్లో గృహ కుళాయి కనెక్షన్లకు అక్రమంగా మోటార్లు బిగించి నీటిని తోడివేయడంవల్ల చివరి ప్రాంతాల్లో ప్రజలు నీటి సమస్య ఎదుర్కొంటున్నారన్నారు. అక్విడక్ట్‌నిర్మాణ పనులవల్ల పంపాలో ఏలేరు నీరు విడుదల కావడం లేదన్నారు. జిల్లాలో ఉపాధిహామీ పథకం అమలులో లక్ష్యసాధనలో ఉత్తమ కృషిచేసిన ఎంపీడీవోలను అభినందించారు. మొదటిస్థానంలో పిఠాపురం,రెండోస్థానంలోగండేపల్లి, మూడోస్థానంలో కాకినాడ రూరల్, నాల్గోస్థానంలో ఏలేశ్వరం మండలం నిలువగా ఎంపీడీవోలను, ఏపీవోలను కలెక్టర్ మెమెంటోలు ఇచ్చి సత్కరించారు.



బండారులంకలో మగ్గంపై నేత నేస్తున్న కార్మికురాలు

"టీడీపీ వ్యవస్థాపకుడు నందమూరి తారకరామారావు జనతా వస్త్రాల పథకంతో చేనేత కార్మికులకు చేతినిండా పని కల్పించారు. ఆ తర్వాత చంద్రబాబు ప్రభుత్వం చేనేత ముడి సరుకులైన చిలపనూలుపై 20 నుంచి 40శాతం రాయితీ ఇచ్చింది. అంతేకాదు మిల్లు వస్త్రాల పోటీని తట్టుకునేందుకు చేనేత వస్త్ర ఉత్పత్తులపై 20 నుంచి 30శాతం రాయితీ ఇచ్చి విక్రయాలు చేసుకునే సదుపాయం కల్పించారు. అనంతరం వచ్చిన వైసీపీ ప్రభుత్వం చేనేత సంక్షేమ పథకాలన్నింటికీ మంగళం పాడేసింది. నేతన్న నేస్తంతో చేతులు దులుపుకుంది. దాంతో చేనేత సహకార సంఘాలకు, కార్మికులకు కోట్ల రూపాయల మేర బకాయిలు విడుదల చేయకుండానే ఐదేళ్లూ గడిపేసింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో చేనేత కార్మికుల్లో ఆశలు చిగురించాయి. వారి ఆశలను అడియాశలు చేయకుండా గతంలో వైసీపీ ప్రభుత్వం నిలిపివేసిన ఒక్కో పథకాన్ని తిరిగి అమలు చేయడానికి శ్రీకారం చుట్టింది."

చేనేత రంగానికి జవసత్వాలు

చేనేత కార్మికుల సంక్షేమానికి శ్రీకారం చుట్టిన కూటమి ప్రభుత్వం

(అమలాపురం రూరల్-ఆంధ్రజ్యోతి)

నేతన్నల సృజనాత్మకతతో బయటకు వచ్చిన జమదానీ చీరలకు లభించిన గుర్తింపు అంతా ఇంతా కాదు. ఏకంగా పేటెంట్ హక్కు దక్కించుకున్న ఘనత దీనిదే. ఉప్పాడలో తయారవుతున్న జమదానీ చీరలను ఇప్పుడు కోనసీమ జిల్లాలోని పలు చేనేత గ్రామాల్లో సైతం నేస్తున్నారు. హసన్‌బాద్‌లో తయారయ్యే దుప్పట్లు, తువ్వాళ్లు, పులగుర్తలో ఖాదీ వస్త్రాలు, షర్టింగ్ క్లాత్స్, కె.జగన్నాథపురం, విలసవిల్లి గ్రామాల్లో పంజాబీ డ్రెస్ మెటీరియల్స్, బండారులంక, జగ్గన్నపేట, కేశనపల్లి, మండపేట, మోరి, ముమ్మిడివరం, పెనుమల్ల, పుల్లేటికుర్రు, ఆదివారపుపేట, అంగర, రాయవరం తదితర చేనేత గ్రామాల్లో తయారయ్యే చేనేత బుటా నేత చీరలు, జాకార్డ్, లుంగీలు, తివాచీలతో పాటు దివాన్‌సెట్లు, పిల్లో కవర్లు, కుప్పడం పంచెలు మంచి గుర్తింపు పొందాయి. రూ.300 నుంచి రూ.3లక్షలు విలువ చేసే చేనేత చీరలను తయారు చేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యానికి గురై జిల్లాలోని ఒక్కో చేనేత సహకార సంఘం లక్షలాది రూపాయల నుంచి కోట్ల రూపాయల మేర అప్పుల ఊబిలో కూరుకుపోయి ఉన్నాయి. వారిని ఆదుకుని తిరిగి చేనేత రంగానికి జవసత్వాలు నింపే విధంగా చంద్రబాబు ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

జిల్లాలో 5వేల కుటుంబాలకు పైబడి ఉచిత విద్యుత్

కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఒక్కో కుటుంబానికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించనుంది. ఇప్పటికే ప్రభుత్వం జీవో నెం.44 జారీ చేసింది. పవరలూమ్‌లకు 500 యూనిట్లు చొప్పున ఉచిత విద్యుత్ అందిస్తారు. రెక్కాడితేగానీ డొక్కాడని నేత కుటుంబాలకు విద్యుత్ చార్జీల భారం ఇకపై ఉండదు. గతంలో వైసీపీ ప్రభుత్వం ఉచిత విద్యుత్‌ను ఎత్తివేసింది. అంతకుముందు చంద్రబాబు ప్రభుత్వం చేనేత మగ్గం ఉన్న కుటుంబాలకు వంద యూనిట్ల ఉచిత విద్యుత్ అందించింది. ఇప్పుడు 200 యూనిట్లు ఉచిత విద్యుత్‌ను అందించడంతో పాటు అనుబంధ వృత్తులవారికి ఈ పథకం వర్తించేలా చర్యలు తీసుకున్నారు. ఇప్పటివరకు జిల్లాలో 5వేలకు పైగా దరఖాస్తులు అందినట్టు ఆ శాఖ అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. త్వరలోనే అర్హులైన చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్‌ను ప్రభుత్వం అందించనుంది. జిల్లాలో 23 చేనేత సహకార సంఘాల పరిధిలో 6,150 మంది సభ్యులు ఉన్నారు. వీరితో పాటు మాస్టర్ వీవర్ల వద్ద 1,252 మంది కార్మికులు ఉన్నట్టు చేనేత అధికారులు గుర్తించారు. ఉచిత విద్యుత్ కోసంమరిన్ని దరఖాస్తులు అందే అవకాశం ఉందన్నారు.

జిల్లాకు త్వరలో రూ.90 లక్షల త్రిఫ్ట్ ఫండ్ నిధులు

కె.పెద్దిరాజు
చేనేత-జౌళి శాఖ సహాయ సంచాలకుడు
డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా



ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో చేనేత సహకార సంఘాల్లో పనిచేస్తున్న కార్మికులకు ఈ నెలలో రూ.1.10 కోట్లమేర త్రిఫ్ట్ ఫండ్ నిధులు విడుదల కానున్నాయి. గత ప్రభుత్వంలో త్రిఫ్ట్ ఫండ్ పథకాన్ని నిలిపివేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గతంలో కార్మికులకు చెల్లించాల్సిన బకాయిలకు సంబంధించి ప్రత్యేకంగా కోనసీమ జిల్లాలోని 23 చేనేత సహకార సంఘాలకు సంబంధించి అత్యధికంగా రూ.90లక్షలు విడుదల కానున్నాయి. త్వరలోనే ఖజానా శాఖ కార్యాలయం నుంచి ఇవి రానున్నాయి. కార్మికుని వేతనం రూ.100 ఉంటే త్రిఫ్ట్ ఫండ్ కింద చేనేత సంఘాలు రూ.8 జమ చేస్తాయి. తిరిగి ఆ కార్మికునికి రూ.16 జతకలిపి మొత్తంగా రూ.24 చొప్పున చెల్లిస్తారు. అంటే ఒక కార్మికుడు నెలలో రూ.3వేలు వేతనం పొందితే అతనికి అదనంగా రూ.720 దక్కుతుంది.

రాయితీ బకాయిలు విడుదల చేయాలి

చింతా శంకరమూర్తి, మాజీ జడ్పీటీసీ, బండారులంక



జిల్లాలోని చేనేత సహకార సంఘాలకు 20 నుంచి 40 శాతం చిలపనూలు సబ్సిడీపై రూ.3.55 కోట్లు బకాయిలు ఉన్నాయి. 20 నుంచి 30 శాతం చేనేత వస్త్రాల రిబేటు పథకంలో రూ.2.81 కోట్లు బకాయిలు ఉన్నాయి. పావలా వడ్డీ రాయితీ కింద రూ.3.56 కోట్లు, మార్కెటింగ్ ఇన్సెంటివ్ కింద రూ.3.40 కోట్ల బకాయిలు జిల్లాలోని చేనేత కార్మికులకు, సహకార సంఘాలకు చెల్లించాల్సి ఉంది. కూటమి ప్రభుత్వం ఆ బకాయిలన్నీ విడుదల చేసి చేనేత రంగాన్ని ఆదుకోవాలి.

మార్కెటింగ్ సదుపాయం మెరుగుపరచాలి

దొంతంశెట్టి సత్యప్రకాష్, లివరీ చేనేత సహకార సంఘాల ఫెడరేషన్ ఉమ్మడి జిల్లా చైర్మన్



చేనేత సహకార సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయడంతో పాటు చేనేత వస్త్రాలకు జాతీయ, అంతర్జాతీయస్థాయిలో మార్కెటింగ్ సదుపాయం కల్పించాలి. ఇప్పటికే పలు సంఘాలు ఆన్‌లైన్‌లో వస్త్ర వ్యాపారానికి శ్రీకారం చుట్టాయి. ఈ విధానాన్ని ప్రభుత్వం మరింత ప్రోత్సహించాలి. చేనేత వస్త్ర ఉత్పత్తుల విక్రయాలను కేవలం ఆప్కోకు మాత్రమే పరిమితం చేసే విధానానికి స్వస్తి పలకాలి. మరమగ్గాల ధాటికి తట్టుకునేలా చేనేత వస్త్రాలపై 30 శాతం రాయితీ ఇవ్వాలి. అంగన్వాడీలు సహా అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేస్తున్న వారికి అమలు చేస్తున్న డ్రెస్‌కోడ్‌లో భాగంగా చేనేత వస్త్రాలనే వినియోగించేలా ప్రభుత్వం చొరవ చూపాలి.



బండారులంకలో అల్లు పడుతున్న కార్మికులు

నేతన్నకు చంద్రన్న చేయూత

200 యూనిట్ల ఉచిత విద్యుత్ హామీ ప్రకటనపై హర్షాతిరేకాలు

కార్పొరేషన్ (కాకినాడ), ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నారు. ఈ క్రమంలో చేనేతలకూ చేయూత ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. గతంలో ఉన్న వంద యూనిట్ల ఉచిత విద్యుత్‌ను 200 యూనిట్లకు పెంచుతామని స్పష్టం చేశారు. పవర్ లూమ్‌కు కూడా 500 యూనిట్లు ఇస్తామని హామీ ఇచ్చారు. వీటిని అమలు చేస్తామని సీఎం ప్రకటించడంతో కాకినాడ జిల్లాలోని చేనేత కుటుంబాలు చంద్రబాబుపై అభినందనల జల్లు కురిపించాయి.

ఉచిత విద్యుత్ ఎంతో ఉపయోగం

కాకి మంగ, చేనేత కార్మికురాలు, వాకతిప్ప, కొత్తపల్లి మండలం, కాకినాడ జిల్లా



ఇద్దరు పిల్లలతో కుటుంబం ఆర్థిక సమస్యల్లో కూరుకుపోయింది. మరోవైపు అప్పటి పలు రకాల పరిస్థితుల్లో చేనేత రంగంతో పాటు నిత్యావసరాల ధరలు పెరిగి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నాం. ఈ నేపథ్యంలో చేనేత రంగ అభివృద్ధిలో భాగంగా ఉచిత విద్యుత్‌ను ప్రకటించడం చాలా ఆనందంగా ఉంది.

మాట మార్చలేదు... మడమ తిప్పలేదు

ఇంధన లోవబాబు, చేనేత కార్మికుడు



ఎన్నికల హామీలు నెరవేర్చే క్రమంలో కూటమి ప్రభుత్వం మాట మార్చలేదు, మడమ తిప్పలేదు. నేతన్నల నివాసాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, పవర్‌లూమ్‌కి 500 యూనిట్లు అందిస్తున్నట్టు ప్రకటించడం ఆనందదాయకం.

సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు

పొన్నగంటి సత్యనారాయణ, అఖిల భారత పద్మశాలీ సంఘం కార్యదర్శి, కాకినాడ పట్టణ పద్మశాలీ సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు



చేనేత కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీ నెరవేర్చుకోవడం పట్ల నేతల కుటుంబాలన్నీ సంతోషంగా ఉన్నాయి. చేనేతల అభివృద్ధికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు అందరూ కృతజ్ఞతలు చెప్తున్నారు.

పెరుగులంకలో చెరువుల తవ్వకాలపై విచారణ



విచారణ చేస్తున్న తహశీల్దార్ విజయశ్రీ

ఐ.పోలవరం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): గోదావరి పెరుగులంక భూముల్లో కొనసాగుతున్న రొయ్యల చెరువుల తవ్వకాలపై రెవెన్యూ యంత్రాంగం స్పందించింది. అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం, ముమ్మిడివరం, తాళ్లరేవు, కె.గంగవరం మండలాల పరిధిలో గోదావరి చెంత ఉన్న పెరుగులంక భూముల్లో ఆక్వా చెరువుల తవ్వకాలు జరుగుతున్నట్టు పలువురు ఆరోపిస్తున్నారు. పెరుగులంక భూముల్లో అక్రమంగా చెరువులు తవ్వుతూ నిబంధనలకు విరుద్ధంగా మట్టిని ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారంటూ పశువుల్లంకకు చెందిన చీకురుమిల్లి తాతారావు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాలతో స్థానిక రెవెన్యూ యంత్రాంగం పెరుగులంక భూముల్లో పర్యటించి వివరాలు సేకరించారు. తహశీల్దార్ సీహెచ్ విజయశ్రీ, డిప్యూటీ తహశీల్దార్ మహాలక్ష్మీనాయుడు, మండల సర్వేయర్ మహేష్‌తో పాటు వీఆర్వోల బృందం ఆక్వా చెరువుల తవ్వకాలను పరిశీలించారు. పశువుల్లంక, కొమరగిరి గ్రామాల సరిహద్దుల్లో జరుగుతున్న చెరువుల తవ్వకాలకు రెవెన్యూ యంత్రాంగం స్పందించింది. మండల పరిధిలో సుమారు 427 ఎకరాలు పెరుగులంక భూమి ఉన్నట్టు అధికారులు గుర్తించారు. ఈ భూమిలో చెరువుల తవ్వకాలపై రెవెన్యూ యంత్రాంగం విచారణ చేపట్టింది. ముందుగా ఆయా మండలాల పరిధిలో ఉన్న పెరుగులంక భూములను గుర్తించే పనిలో రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టారు.

జీడిపప్పు కార్మికులను ఆదుకుంటాం

- ఎమ్మెల్యే దేవ వరప్రసాద్
- మోరి, మోరిపోడులో జీడిపప్పు పరిశ్రమల సందర్శన



మోరి ఫ్యాక్టరీలో జీడిపప్పుని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్

మలికిపురం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఎన్డీఏ ప్రభుత్వ హయాంలో అందరికీ మేలు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. విద్యుత్ సమస్యలతో మోరి, మోరిపోడులో నష్టపోయిన జీడిపప్పు పరిశ్రమలను, కార్మికులను ఆయన సందర్శించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం మోరి జీడిపప్పు పరిశ్రమపై పరిసర గ్రామాల కార్మికులు ఆధారపడి ఉన్నారని, జీడిపప్పును కుటీర పరిశ్రమగా గుర్తించి ప్రభుత్వపరంగా చేయూతనిచ్చే విధంగా సంబంధిత అధికారులతో మాట్లాడతామన్నారు. గత రాత్రి విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద బ్రేకర్లు ఫెయిల్ అయి విద్యుత్‌లో హెచ్చుతగ్గుల వల్ల జరిగిన కారణంగా సుమారు రూ.5-రూ.6 లక్షలు నష్టం జరిగిందని, పలు ఫ్యాక్టరీల్లో మోటార్లు కూడా కాలిపోయినట్టు తన దృష్టికి వచ్చిందన్నారు. మోరి, మోరిపోడులోని 12 జీడిపప్పు పరిశ్రమలకు చిన్నతరహా పరిశ్రమల ద్వారా ఉండే రాయితీలు వచ్చేవిధంగా సంబంధిత మంత్రితో మాట్లాడతానన్నారు. ఈ పరిశ్రమలకు విద్యుత్ రాయితీ పై మంత్రితో చర్చిస్తానన్నారు. ఫ్యాక్టరీ యజమాని ముప్పర్తి సుబ్బారావు జరిగిన నష్టం తీరును ఎమ్మెల్యేకు వివరించారు. ఎమ్మెల్యే వెంట తహశీల్దార్ వెంకటేశ్వరరావు, ఎల్ఐ ప్రసాద్, ముప్పర్తి నాని, దిరిశాల బాలాజీ, గుబ్బల ఫణి, పినిశెట్టి బుజ్జి, రావూరి నాగు, బళ్ల రాము, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ట్రాన్స్‌కో ఏడీపై సీఎంతో మాట్లాడా

రాజోలు నియోజకవర్గంలో విద్యుత్ సమస్యలకు సుదీర్ఘ కాలం నుంచి పనిస్తున్న ఎలక్ట్రికల్ ఏడీఈ పనితీరే కారణమని ఎమ్మెల్యే వరప్రసాద్ అన్నారు. అతను సుదీర్ఘ కాలం నుంచి ఉండడంతో పాటు సరిగా స్పందించకపోవడంతో ఇటువంటి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయన్నారు. అతని స్థానంలో కొత్తవారిని నియమించే విధంగా చర్యలు తీసుకోవాలని సీఎండీ, ఎస్ఈలతో మాట్లాడారు.

వెంకన్న ఆలయంలో కన్నుల పండువగా సదస్యం



వెంకన్న ఆలయంలో సదస్యం నిర్వహిస్తున్న వేద పండితులు

ఆత్రేయపురం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా నాల్గో రోజు గురువారం స్వామివారికి మేలుకొల్పు, తీర్థపు బిందెతో గోదావరి జల సంగ్రహణ, నీత్యార్చన, నిత్యమహోమాలు, దిగ్వేవత బలిహరణ, నీరాజన మంత్రపుష్పం, ద్రవిడ వేద పారాయణ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం మధ్యాహ్నం విశ్వక్సేన పూజ, అష్టదిపాలకన ఆరాధన, సదస్యం వైభవంగా నిర్వహించారు. చతుర్వేద పండితులతో మహాదాశీర్వచనం కన్నుల పండువగా నిర్వహించారు. వైఖానస ఆగమ శాస్త్రప్రకారం ఖండవిల్లి రాజేశ్వరవరప్రసాద్‌చార్యులు బ్రహ్మత్వంలో ప్రధాన హోమాలు, దిగ్వేవత బలిహరణ జరిపారు. వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి. గోవింద నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. జిల్లా ఆరోగ్య ఉపశాఖాధికారిణి డాక్టర్ సుమలత, ఎంపీడీవో వెంకటరామన్, రావులపాలెం ఆర్టీసీ డీఎం రమణ స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం వారందరికీ పండితులు శేషవస్త్రం, తీర్థప్రసాదాలు అందించారు.



ఉత్సవమూర్తులు



డిప్యూటీ డీఎంహెచ్‌వోకు స్వామివారి శేషవస్త్రం సమర్పించిన దృశ్యం

నేడు చేబ్రోలులో గుర్రాల ప్రదర్శన పోటీలు



పోటీలకు తరలివచ్చిన గుర్రాలు

గొల్లప్రోలు రూరల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలులో శుక్రవారం మధ్యాహ్నం రాష్ట్రస్థాయి గుర్రాల పరుగు ప్రదర్శన పోటీలు జరగనున్నాయి. చేబ్రోలు బైపాస్‌లో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నివాసం చెంతనే ఉన్న రోడ్డులో సీతారామస్వామి ఆలయ కమిటీ, జనసేన పార్టీ ఆధ్వర్యంలో జరిగే ఈ పోటీలకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి గుర్రాలు ఇప్పటికే తరలివచ్చాయి. చేబ్రోలులో తొలిసారి జరుగుతున్న పోటీలు కావడంతో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. పోటీల్లో తొలి పది స్థానాలు సాధించిన గుర్రాలకు పురస్కారాలు ప్రదానం చేయనున్నారు.

జాతీయ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో జూహితకు గోల్డ్‌మెడల్



రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం క్రీడా కీర్తి దేశవ్యాప్తంగా ఇనుమడించింది. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం నగరానికి చెందిన విద్యార్థి జూహిత గుణ వెయిట్ లిఫ్టింగ్‌లో సత్తాచాటి గోల్డ్‌మెడల్ సాధించింది. మణిపూర్‌లోని ఇంపాల్ నగరంలో గురువారం జరిగిన జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్ పోటీలు అండర్-17 విభాగంలో రాజమహేంద్రవరంలోని లాలాచెరువు ఉన్నత పాఠశాల విద్యార్థిని జూహిత గుణ గోల్డ్‌మెడల్ సాధించింది. ఈ సందర్భంగా విద్యార్థినికి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అంకం మల్లేశ్వరరావు, వ్యాయామ ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. అలాగే జూహిత గుణ ప్రతిభను రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్ ప్రత్యేకంగా అభినందించారు.

సామర్లకోట మీదుగా ప్రత్యేక రైళ్లు

చర్లపల్లి-నహరలగున్ మధ్య ఆరు ఎక్స్‌ప్రెస్‌లు

సామర్లకోట, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): వేసవి సెలవు రోజుల్లో వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగించే రైలు ప్రయాణికుల రద్దీని నియంత్రించేందుకు ప్రయాణికులకు మరింత సేవలందించేందుకు ఆరు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లను చర్లపల్లి-నహరలగున్ మధ్య సామర్లకోట మీదుగా వివిధ ప్రాంతాలకు అందుబాటులోకి తెస్తున్నట్టు రైల్వే పీఆర్వో కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ చేశారు. సామర్లకోట రైల్వే ఉన్నతాధికారులకు అందిన సమాచారాన్ని రాత్రి ఆంధ్రజ్యోతి సేకరించింది. 07046 నంబరు గల చర్లపల్లి-నహరలగున్ మధ్య నడిచే ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ ఈ నెల 12,19,26లలో ప్రతీ శనివారం చర్లపల్లి నుంచి ఉదయం 8.40 గంటలకు బయలుదేరి రాజమహేంద్రవరం స్టేషన్‌కు సాయంత్రం 5గంటలకు చేరుకుని సామర్లకోటకు 6.05గంటలకు చేరుతుంది. తిరిగి ఎలమంచిలి, అనకాపల్లి, దువ్వాడ, సింహాచలం నార్త్, కొత్తవలస, విజయనగరం, శ్రీకాకుళం రోడ్, పలాస, బెరహమ్‌పూర్, బాలూగాన్, ఖుర్దారోడ్, భువనేశ్వర్, కటక్, జైపూర్ కోయింజహార్ రోడ్, భద్రక్, బాలేశ్వర్, ఖరగపూర్, అండుల్, డంకుని, బార్ధమన్, బోలాపూర్ శాంతినికేతన్, రాంపూర్ హాల్ట్, మాల్డా టౌన్, కిషన్‌గంజ్, అలూబరి రోడ్, న్యూ జలపాయిగురి, దూప్‌గురి, న్యూకోచ్ బెహరి, న్యూ అలిపురదార్, కొక్రాజిహార్, న్యూ బొంగాయ్‌గాన్, బారాపేట రోడ్, రంగియా, ఉదల్‌గురి, రంగపారా నార్త్, హారముతిల మీదుగా అరుణాచల్‌ప్రదేశ్‌లోని నహరలగున్ స్టేషన్‌కు సోమవారం సాయంత్రం 4 గంటలకు చేరుతుంది. 07047 నంబరు గల అరుణాచల్ ప్రదేశ్ నహరలగున్ నుంచి చర్లపల్లి మధ్య నడిచే ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు ఈ నెల 15, 22,29లలో నహరలగున్ నుంచి ప్రతీ మంగళవారం మధ్యాహ్నం 13.00గంటలకు బయలుదేరి సామర్లకోటకు మధ్యాహ్నం 10.10గంటలకు చేరుకుని కాకినాడకు రాజమహేంద్రవరంనకు 10.58గంటలకు చేరుతుంది. చర్లపల్లి స్టేషన్‌కు గురువారం రాత్రి 9.30 గంటలకు చేరుతుంది. ఈ ప్రత్యేక రైలులో సెకండ్ ఏసీ-1, థర్డ్ ఏసీ-5, స్లీపర్ క్లాస్-10, ఎల్ఎస్ఎల్ఆర్డీ-1, ఈవోజీ-1 చొప్పున 18 ఎల్‌హెచ్‌బీ బోగీలతో ప్రయాణికులకు సేవలందించనుంది.

ఈ రైళ్లల్లో ప్రయాణించే వారు రిజర్వేషన్ టిక్కట్లు తదితర సమాచారం కోసం ఆయా సమీప స్టేషన్లలోను బుకింగ్ కార్యాలయాలలోను సంప్రదించాలని రైల్వే ఉన్నతాధికారులు జారీ చేసిన లేఖలో తెలిపారు.

ఏమ్మా.. ఎలా ఉన్నారు?



తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని ఆవ రోడ్డులో ఏకలవ్య బాలల వసతిగృహం, బొమ్మూరులోని బాలికల వసతి గృహాలను డీఎల్ఎస్ఏ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎన్.శ్రీలక్ష్మీ గురువారం సందర్శించారు. వసతి పొందుతున్న వారికి అందుతున్న సదుపాయాలను పరిశీలించారు. వారికి సురక్షిత తాగునీరు, పౌష్టికాహారం అందించాలని, వైద్యం విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ అశ్రద్ధ వహించవద్దని అక్కడి సిబ్బందిని ఆదేశించారు. విద్యార్థులతో మాట్లాడి యోగక్షేమాలను ఆరా తీశారు. ఎలాంటి సమస్యలు ఉన్నా, న్యాయ సహాయం అవసరమైనా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. డీఎల్ఎస్ఏ తరఫున తగు చర్యలు తీసుకోడానికి ఎల్లవేళలా సిద్ధంగా ఉంటామన్నారు.

- రాజమహేంద్రవరం(ఆంధ్రజ్యోతి)

శృంగారవల్లభుడి ఆలయంలో సామూహిక కుంకుమార్చన



పెద్దాపురం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం తొలి తిరుపతిలోని శృంగారవల్లభ స్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా గురువారం సుమారు 500 మంది ముత్తయిదువులు ఉచిత సామూహిక కుంకుమార్చన చేశారు. వారికి దేవస్థానం తరఫున పూజా సామగ్రి ఉచితంగా అందజేసి అన్నప్రసాదం ఏర్పాటు చేశారు. కార్యనిర్వాహణాధికారి వడ్డి శ్రీనివాసరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమనారాయణాచార్యులు, పెద్దింటి నారాయణాచార్యులు, సర్పంచ్ మొయిళ్ల కృష్ణమూర్తి, అంజనీకుమార్, సేవకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విజ్ఞాన గని 'యనమల'



సభలో మాట్లాడుతున్న మంత్రి నారాయణ

- సుదీర్ఘ రాజకీయ నేతగా ఎన్నో విలువలు నెలకొల్పారు
- అధిరోహించిన పదవులన్నింటికీ వన్నెతెచ్చిన నేత
- సంక్షోభాలు, ఒడిదుడుకుల్లోనూ చెక్కుచెదరని నేతగా పేరొందారు
- యనమల 42ఏళ్ల రాజకీయ ప్రస్థాన సభలో కొనియాడిన స్పీకర్, మంత్రులు, ఎమ్మెల్యేలు
- సభకు తరలివచ్చిన నేతలందరికీ కృతజ్ఞతలు : యనమల



సభలో మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు, పల్లా శ్రీనివాస్, ఎమ్మెల్యే దివ్య



పాటలు పాడుతున్న వందేమాతరం శ్రీనివాస్



మాట్లాడుతున్న మంత్రి అయ్యన్నపాత్రుడు

కాకినాడ/తునిరూరల్ ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): 'టీడీపీ సీనియర్ నేత యనమల రాజకీయ విజ్ఞాన గని. అమరావతి నుంచి అమెరికా వరకు అనేక అంశాలను నిత్య విద్యార్థిలా చదువుతూ అందరికీ వివరిస్తూ ఎంతోఖ్యాతి గడించారు. ఎంతోమంది ఎమ్మెల్యేలు, మంత్రులకు యనమల రాజకీయ గురువు. 42ఏళ్ల రాజకీయాల్లో ఆయన చూడని పదవులు, హోదాలు లేవు. ఇన్నేళ్ల రాజకీయాల్లో ఏరోజు గర్వపడడం కానీ, కుంగిపోవడం కానీ ఎరుగని నాయకుడు. సంక్షోభాలు, సమస్యలు ఎదురైనా చెక్కుచెదరకుండా శ్రీకృష్ణుడిలా చిరునవ్వుతూ కనిపించే యనమల రాజకీయ రారాజు' అని అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మంత్రులు అనిత, అచ్చెన్న, నారాయణ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర నేతలు కొనియాడారు. కాకినాడజిల్లా తునిలో యనమల 42ఏళ్ల రాజకీయ ప్రస్థాన సభ గురువారం అంగరంగ వైభవంగా జరిగింది. జిల్లా నలుమూలల నుంచి వేలాదిగా తరలిరావడంతో తుని పట్టణంలో సాయివేదిక ప్రాంగణం కిక్కిరిసిపోయింది. భారీ బాణసంచా మిరిమిట్ల మధ్య సభ పండుగ వాతావరణంలో కళకళలాడింది.

కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన స్పీకర్ అయ్యన్న పాత్రుడు ఇతర నేతలతో కలిసి యనమల 42ఏళ్ల రాజకీయ ప్రస్థానం పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. అంతకుముందు అక్కడే ఏర్పాటు చేసినయనమల ఫొటోగ్యాలరీని స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి ప్రారంభించారు. గ్యాలరీలో యనమల చిన్ననాటి నుంచి నేటివరకు ఏర్పాటు చేసిన ఫొటోలు ఆకట్టుకున్నాయి. హోంమంత్రి అనిత జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించా రు. ఈ సందర్భంగా స్పీకర్ అయ్యన్న మాట్లాడుతూ రాజకీయాల్లో ఉన్నత శిఖరాలకు ఎదిగిన యనమల తూర్పుగోదావరి జిల్లాకు ఎంతో ఖ్యాతిని తీసుకొచ్చారన్నారు. రాజకీయాల్లో విలువైన వ్యూహకర్తగా పేరొందారని కొనియాడారు. అర్హత ఉన్న వారికి జరుగుతున్న సన్మానం అని పేర్కొన్నారు. యనమల సంస్కారం, సమర్థతతో ఎందరికో రాజకీయాల్లో ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. ఎన్టీఆర్‌కు యనమల ముద్దుబిడ్డగా మారారని, ఎందుకు యనమలను అంతగా ఇష్టపడ్డారో తెలియలేదన్నారు. 11సార్లు ఆర్థిక మంత్రిగా పనిచేయడం అరుదైన రికార్డు అని వివరించారు. మంత్రులు అనిత, అచ్చెన్నాయుడు, నారాయణ ప్రసంగిస్తూ యనమల నిబద్ధత కలిగిన వ్యక్తి అని కొనియాడారు. ఎంతోమంది ఎమ్మెల్యేలకు అనేక విషయాలు నేర్పినవారు రాజకీయంగా మరింత ఎదిగేలా సహకరించారని గుర్తుచేశారు. అనేక రాజకీయ సంక్షోభాలప్పుడు ఆయన్ను కలవడానికి వెళ్లినప్పుడు చిరునవ్వుతో ఒత్తిడి లేకుండా కనిపించడం ఆయనకు మాత్రమే సాధ్యమని వివరించారు. తొలిసారిగా ఎమ్మెల్యేలుగా ఉన్నప్పుడు తామంతా యనమల నుంచి ఎంతో నేర్చుకున్నామన్నారు. అవకాశాలు అందరికీ వస్తాయని, వాటిని అందిపుచ్చుకుని నిలబడడం యనమలకు మాత్రమే సాధ్యమన్నారు. యనమల, కింజరపు, గౌతు, ప్రతిభా భారతి తదితర కుటుంబాలు ఎప్పుడూ నారా కుటుంబానికి అంకితమన్నారు. మంత్రి అచ్చెన్న మాట్లాడుతూ యనమలకు కొడుకులు లేరని రాజకీయ వారసత్వం కనుమరుగు అయిపోతుందన్న ఆవేదన తనకు ఉండేదని, కానీ దివ్య రాకతో ఆ కొరత తీరిందని అన్నారు. రాజకీయాల్లో పదవులు లేకపోయినా క్రమశిక్షణగా ఉండాలని, పదవులు లేవని, అన్యాయం జరిగిందని అంటే ఎదగలేమని అన్నారు. యనమల ఎప్పుడూ టీడీపీకి గైడ్‌గా ఉండాలని కోరారు. యనమల సలహాలు పార్టీకి, నేతలకు ఎంతో అవసరమని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చియ్య చౌదరి మాట్లాడుతూ యనమల రాజకీయాల్లో వటుడంతడిలా ఎదిగారన్నారు. ఆయనలో తాను ఎప్పుడు కోపం, ఆవేశం చూడలేదన్నారు. అందుకే తనకు యనమలను చూస్తే ఈర్ష్యగా ఉందని చమత్కరించారు. యనమల దేశస్థాయిలో మంచి పదవులోకి వెళ్లాలని ఆకాంక్షించారు. అనంతరం తుని ఎమ్మెల్యే దివ్య మాట్లాడుతూ తన తండ్రి గురించి మంత్రులు అందరూ గొప్పగా మాట్లాడడం చాలా సంతోషంగా ఉందని, ఆయన నుంచి ఇంతమంది నేతలు ఎన్నో నేర్చుకోవడం తనకు గర్వకారణంగా అనిపిస్తుందని అన్నారు. ఎంతో మంది మంత్రులు, ఎమ్మెల్యేలను పక్కన కూర్చోబెట్టుకుని యనమల సలహాలు, సూచనలు ఇచ్చారని తాను ఎప్పుడైనా ఏదైనా అడిగితే పోయి పుస్తకం చదువుకో అనే వారని అని సరదాగా వ్యాఖ్యానించారు. అనంతరం ఎమ్మెల్యేలు బుచ్చిబాబు, ఆనందరావు, వనమాడి కొండబాబు, పంతం నానాజీ, నిమ్మకాయల చినరాజప్ప, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, ఎంపీ సానా సతీష్, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, మాజీ ఎమ్మెల్సీ చిక్కాల రామచంద్రరావు, కాకినాడరూరల్ మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, సత్యనారాయణ తదితరులు ప్రసంగించారు. యనమల తెలుగుదేశం పార్టీకి అత్యంత విలువైన నేతగా కొనియాడారు. తామంతా కష్టసుఖాలు ఎప్పుడు యనమలతో పంచుకుంటూ ఆయన అనుభవాల నుంచి ఎన్నో నేర్చుకున్నామని గుర్తు చేశారు. సభా కార్యక్రమంలో ఆఖరిలో ప్రసంగించిన యనమల తన 42ఏళ్ల రాజకీయ ప్రస్థానాన్ని నెమరువేసుకున్నారు. చిన్న వయస్సులో ఎన్టీఆర్ టిక్కెట్ ఇచ్చి ప్రోత్సహించారని గుర్తు చేశారు. అనంతరం చంద్రబాబుతో కలిసి సుదీర్ఘంగా పనిచేయడం ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని గుర్తుచేశారు. 42 ఏళ్ల రాజకీయ ప్రస్థానంలో 38ఏళ్లు కేబినేట్ హోదాలో కొనసాగడం పార్టీ తనకు ఇచ్చిన గౌరవంగా భావిస్తానన్నారు. సభకు ఇంతమంది రావడం ఆనందం కలిగిస్తోందన్నారు. సభా కార్యక్రమంలో తొలుత యనమల ప్రస్థానంపై ప్రత్యేక డాక్యుమెంటరీ ప్రదర్శన అందరినీ అలరించింది. సభావేదికకు కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ హాజరై యనమలకు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు. సభా కార్యక్రమంలో ప్రముఖ సంగీత దర్శకుడు, గాయకుడు వందేమాతరం శ్రీనివాస్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. కదులుదాం రండి మనం.. జన్మభూమికి.. గీతాన్ని ఆలపించి కార్యకర్తలను ఉత్తేజపరిచారు. నియోజకవర్గ నలుమూలల నుంచి వేలాదిమంది కార్యకర్తలు, నాయకులు తరలిరాగా యనమల వారికి ఆత్మీయ విందు ఏర్పాటు చేశారు.



ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న మంత్రులు, ఎమ్మెల్యేలు



సభకు హాజరైన నాయకులు, కార్యకర్తలు

వ్యాపారి కిడ్నాప్ కలకలం

- కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసులు



కిడ్నాప్‌కు గురైన వ్యాపారి శిరగం మురళీహరసుబ్బారావు

రావులపాలెం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): రావులపాలెంనకు చెందిన ఓ వ్యాపారి కిడ్నాప్ అయిన ఘటన కలకలం రేకెత్తించింది. దీనిపై పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెంలోని ఆదిలక్ష్మీనగర్ ఐదో వీధిలో నివాసం ఉంటున్న శిరగం శ్రీరామ్(రమేష్) నాలుగు సంవత్సరాల క్రితం మహారాష్ట్రకు చెందిన సంజయ్ అనే వ్యక్తితో వ్యాపారంచేసి బాకీపడ్డాడు. బాకీ విషయమై వేధిస్తుండగా పెద్దలలో చర్చించుకున్నారు. ఇదిలావుండగా శ్రీరామ్ తండ్రి బుధవారంరాత్రి 12.30కు ఇంటికి ఫోన్‌చేసి పని ముగించుకుని వచ్చేస్తున్నట్లు తెలిపాడన్నారు. ఎంతసేపటికీ ఇంటికి రాకపోవడంతో అతడి కోసం వెతుకుతుండగా మార్గమధ్యంలో గునిశెట్టి నాగేంద్ర ఇంటి సమీపంలో మురళీహర సుబ్బారావు మోటార్ సైకిల్, చెప్పులు, కళ్లజోడు ఉండటాన్ని కుమారుడు గుర్తించాడన్నారు. గురువారం ఉదయం తండ్రి కుమారుడికి ఫోన్‌చేసి సంజయ్ అతని కూడా వచ్చిన వారు బలవంతంగా కారులో ఎక్కించుకుని మహారాష్ట్రకు తీసుకుని వెళుతున్నట్లు తెలిపిన అనంతరం ఫోన్ స్విచ్ ఆఫ్ వచ్చిందన్నారు. దీంతో శ్రీరామ్ గంటికి చెందిన రుద్ర సురేష్ ద్వారా సంజయ్, రమేష్, గోపయ్య తదితరులు తన తండ్రిని కిడ్నాప్ చేశారని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. శ్రీరామ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేవీ రమణారెడ్డి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రంప పీజీఆర్ఎస్ వేదికకు జడ్పీ సీఈవో నిరాకరణ

- వివాదాస్పదమవుతున్న జిల్లా, మండల పరిషత్ అధికారుల తీరు
- వైసీపీ ప్రజా ప్రతినిధులకు భవనాన్ని ఎలా ఇస్తారంటూ దేశం నేతల ఎద్దేవా

రంపచోడవరం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తునన్న ప్రజా సమస్యల పరిష్కార(పి.జి.ఆర్.ఎస్) వేదికను అంతే ప్రతిష్ఠాత్మకంగా నియోజకవర్గ స్థాయిలో నిర్వహించేందుకు మాత్రం అధికార యంత్రాంగం అడ్డుపడుతోంది. రంపచోడవరం నియోజకవర్గ స్థాయిలో రంపచడవరం కేంద్రంగా ఎమ్మెల్యే శిరీషదేవి రంపచోడవరం ఎంపీడీవో కార్యాలయంలో పి.జి.ఆర్.ఎస్.వేదిక నిర్వహణ కోసం భవనాన్ని కేటాయించాలని కాకినాడలోని ఉమ్మడిజిల్లా పరిషత్ సీఈవోను కోరారు. కాగా ఇందుకు ఆయన నిరాకరిస్తూ ఎమ్మెల్యేకు సమాచారాన్ని ఇచ్చారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహణ కోసం ఖాళీగా ఉన్న భవనాన్ని అడిగితే అందుకు రంపచోడవరం ఎంపీడీవో సూచనలతో జిల్లా పరిషత్ సీఈవో నిరాకరించడం వివా దంగా మారింది. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మక కార్యక్రమానికే జిల్లా పరిషత్ సీఈవో అడ్డుతగలడంపట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అంతేకాకుండా ప్రజా కార్యక్రమం కోసం భవనాన్ని అడిగితే కార్యాలయం కోసం భవనం అడిగినట్టుగా ఎత్తిచూపి నిరాకరిస్తున్నట్టు అధికారులు పేర్కొన్నారు. తాము ప్రజా ప్రయోజన కార్యక్రమానికి అడిగితే వీలులేదని చెప్పిన అధికారులు ఎంపీడీవో కార్యాలయంలో వైసీపీ ఎమ్మెల్సీకి, రంప చోడవరం జడ్పీటీసీ కార్యాలయాన్ని ఎలా కొనసాగింప చేస్తారని ప్రశ్నిస్తున్నారు. ఈ అంశంపై జిల్లా పరిషత్ సీఈవో, రంపచోడవరం ఎంపీడీవోలపై ప్రభుత్వానికి ఫిర్యాదు చేసేందుకు కూడా ఇక్కడి నేతలు సిద్ధమవుతున్నారు.

ట్రాక్టరు బోల్తా.. వ్యక్తి మృతి

సీతానగరం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టరు తిరగబడి వ్యక్తి మృతి చెందిన సంఘటన రఘుదేవపురం ఇటుకబట్టీవద్ద చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు రఘుదేవపురం గ్రామానికి చెందిన ఇటుకబట్టీ యజమాని సిద్దే వెంకటేశ్వర్లు 45 గురువారం ఇటుకబట్టీ వద్ద ట్రాక్టరుతో మట్టి తొక్కుతుండగా ప్రమాదవశాత్తూ ట్రాక్టరు తిరగబడి మట్టిలో కూరుకుపోయాడు. ఇటుకబట్టీ వద్ద ఉన్న వారు ఎక్స్‌కవేటర్ సహాయంతో ట్రాక్టరును తొలగించి మట్టిలో కూరుకుపోయిన వెంకటేశ్వరరావును బయటకు తీయగా కొనఊపిరితో ఉన్న అతనిని చికిత్స నిమిత్తం హుటాహుటిని స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు మృతుడికి భార్య దుర్గాభవాని వివాహమైన ఇద్దరు కుమార్తెలు కోటేశ్వరి, సంధ్యా రాణిలు ఉన్నారు. భార్య దుర్గా భవాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ శ్రీను కేసు నమోదుచేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



ట్రాక్టరు తిరగబడి మట్టిలో కూరుకుపోయిన వ్యక్తిని బయటకు తీసుకువచ్చిన దృశ్యం, మృతుడు సిద్దే వెంకటేశ్వర్లు





కాకినాడ తీరంలో వైమానిక విన్యాసాలు నిర్వహిస్తున్న యుద్ధ విమానాలు



శత్రువులపై దాడి చేస్తున్న ఆర్మీ సైనికులు

అబ్బురపరచిన త్రివిధ దళాల విన్యాసాలు

- కాకినాడ సముద్ర తీరంలో టైగర్ ట్రయింఫ్

సర్పవరం జంక్షన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ సాగరతీరంలో భారత్-అమెరికా దేశాలు సంయుక్తంగా మూడురోజులుగా నిర్వహిస్తున్న టైగర్ ట్రయింఫ్-2025 విన్యాసాలు అబ్బురపరుస్తున్నాయి. గురువారం సముద్రజలాల్లో భారత్‌కు చెందిన ఐఎన్ఎస్ జలశ్వ, ఆకాశంలో ఐఏఎఫ్ హక్స్ యుద్ధవిమానాలు, యూఎస్ఏకు చెందిన ఎయిర్‌క్రాఫ్ట్ సిబ్బంది విన్యాసాల్లో పాల్గొన్నారు. యాంపీబీయస్ విన్యాసాల ఔటర్ ప్రాంతంలో బందోబస్తు ఏర్పాట్లను కాకినాడ ఎస్‌డీపీవో దేవరాజ్ మనీష్ పా టిల్ ఆధ్వర్యంలో కాకినాడరూరల్ సీఐ డీఎస్ చైతన్యకృష్ణ, తిమ్మాపురం ఎస్‌హెచ్‌వో, ట్రైనీ ఐపీఎస్ సుస్మిత పర్యవేక్షించారు.

జనావాసాల్లోకి చుక్కల జింక

- అటవీప్రాంతంలో వదిలేసిన ఫారెస్ట్ అధికారులు

రాజవొమ్మంగి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): అల్లూరిజిల్లా రాజవొమ్మంగి మండలంలోని సూరంపాలెం గ్రామంలో గురువారం తెల్లవారుజామున సమీప అటవీ ప్రాంతం నుంచి చుక్కల జింక ఒక ఇంట్లోకి ప్రవేశించింది. దీంతో గ్రామస్తులు ఇంటి తలుపులువేసి స్థానిక ఫారెస్టు రేంజ్ అధికారిణి ఉషారాణికి సమాచారం అందించారు. దీంతో ఆమె సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని ఇంట్లో ఉన్న చుక్కలజింకను సురక్షితంగా తిరిగి అటవీ ప్రాంతంలో వదిలిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ రాము, ఫారెస్టు సిబ్బంది, బేస్ క్యాంప్ సిబ్బంది ఉన్నారు.



ఇంటిలో బంధించిన చుక్కల జింక

నేడు ఉమ్మడి జిల్లా రెవెన్యూ అసోసియేషన్ ప్రతినిధులు, తహసీల్దార్ల సమన్వయ సమావేశం

కాకినాడసిటీ, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): కాకినాడ రెవెన్యూ భవన్‌లో శుక్రవారం సాయంత్రం ఐదు గంటలకు ఉమ్మడిజిల్లా రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ ప్రతినిధులు, తహసీల్దార్ల సమన్వయ సమావేశం ఏర్పాటుచేసినట్టు ఏపీఆర్ఎస్ఏ కాకినాడజిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు, ఏపీ జేఏసీ కాకినాడజిల్లా చైర్మన్ పితాని త్రినాథ్ తెలిపారు. 12వ తేదీ ఉదయం 10.30 గంటలకు ఇదే సమావేశ మందిరంలో ఏపీ జేఏసీ అమరావతి సభ్య సంఘాల ప్రతినిధులు, మహిళా విభాగం ప్రతినిధులతో సమావేశం, మధ్యాహ్నం 3గంటలకు క్లాస్-4 ఉద్యోగులు, డ్రైవర్ల సమస్యలపై సమావేశం నిర్వహిస్తామన్నారు.

మహిళ మెడలో ఆభరణాల చోరీ

రాజమహేంద్రవరంసిటీ, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మహిళ మెడలో 12గ్రాముల బంగారు ఆభరణాలు లాక్కెళ్లిన సంఘటన బొమ్మూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం వివరాల్లోకి వెళితే గ్రామానికి చెందిన కె.ఆమని దివాన్‌చెరువు జీఎస్ఎల్‌లో కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేస్తోంది. ఈ నేపథ్యంలో గురువారం తమ బంధువుల ఇంటికి దివాన్‌చెరువు వెళుతుండగా బొమ్మూరు రైస్‌మిల్లు సమీపంలో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి ఆమెపై దౌర్జన్యంగా మెడలో ఉన్న బంగారు వస్తువులు లాక్కొని పోయారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం ఆదెమ్మదిబ్బకు చెందిన టి.రాము (32) తన ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని త్రీటౌన్ పోలీసులు తెలిపారు. ఇంట్లో భార్యాభర్తల మధ్య గొడవలు ఉన్నాయి. ఈనేపథ్యంలో ఈనెల 7న రాత్రి ఇంట్లో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు ప్రయత్నించాడు. అతన్ని చూసిన కుటుంబ సభ్యులు వెంటనే కిందకు దింపి ప్రభుత్వాసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అయితే పరిస్థితి విషమించి గురువారం మృతి చెందాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

15 నుంచి సముద్రంలో చేపల వేటపై నిషేధం

అమరావతి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మత్స్య సంపద పరిరక్షణ, ప్రభావవంతమైన నిర్వహణ కోసం ఏపీ తీరంలోని ప్రాదేశిక జలాల్లో ఈ నెల 15 నుంచి జూన్ 14 వరకు చేపల వేటపై ప్రభుత్వం నిషేధం విధించింది. ఈ మేరకు గురువారం నోటిఫికేషన్ జారీ చేసింది. సాంప్రదాయ పడవలు మినహాయించి, ఔట్ బోర్డ్, ఇన్ బోర్డ్ ఇంజన్లు అమర్చిన మోటరైజ్డ్, మెకనైజ్డ్ బోట్లతో ఈ 61 రోజుల పాటు తూర్పు తీర సముద్ర జలాల్లో మత్స్య సంపద వేటపై నిషేధం అమలులో ఉంటుందని నోటిఫికేషన్‌లో ప్రభుత్వం పేర్కొంది.

స్థలం అమ్ముతామని నగదు తీసుకుని మోసం

- పోలీసులకు ఫిర్యాదు

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరానికి చెందిన జి.సురేఖ ఆమె సోదరిలకు దివాన్ చెరువులో 500 గజాల స్థలం ఉందని చెప్పి దానిని విక్రయిస్తామని 2017లో రూ.50 లక్షలు తీసుకుని మోసం చేశారని హుకుంపేటకు చెందిన ఆకుమర్తి చిన్న అనే వ్యక్తి బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదుచేశాడు. తనను స్థలం విషయంలో మోసంచేసి డబ్బులు తీసుకున్న సురేఖ, ఆమె సోదరిలు ఇప్పుడు ఆ స్థలం అమ్మకపోగా తనను బెదిరరిరింపులకు గురిచేస్తున్నారని ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

21న మోడల్ స్కూల్స్ ప్రవేశ పరీక్ష

అమరావతి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మోడల్ స్కూల్స్‌లో ఆరో తరగతి ప్రవేశాలకు ఈ నెల 20న నిర్వహించదలచిన ప్రవేశ పరీక్షను 21వ తేదీకి మార్చినట్టు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ వి.విజయ రామరాజు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

పెళ్లి పేరుతో మోసం చేశాడంటూ ఫిర్యాదు

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం జాంపేటకు చెందిన ఓ మహిళను అదేప్రాంతానికి చెందిన సయ్యద్ రసూల్ అనే వ్యక్తి పెళ్లి చేసుకుంటానని మోసం చేశాడని బాధిత మహిళ త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య



మృతుడు శివన్నారాయణ

కొవ్వూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులతో యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుని మృతి చెందినట్లు కొవ్వూరు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ఆరికిరేవుల గ్రామానికి చెందిన మారిశెట్టి శివన్నారాయణ (24) గత కొంత కాలంగా మానసికంగా ఇబ్బంది పడుతున్నాడు. అనారోగ్యంతోపాటు, ఆర్థిక ఇబ్బందులతో గురువారం ఇంట్లో ఎవ్వరూలేని సమయంలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుని మృతి చెందాడు. కూలి పనులకు వెళ్లిన తండ్రి సత్యనారాయణ ఇంటికి వచ్చి చూసేసరికి ఫ్యాన్‌కు వేలాడుతున్న కొడుకునిచూసి కన్నీటి పర్యంతం అయ్యాడు. మృతదేహాన్ని కిందకు దింపారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదుమేరకు ఏఎస్ఐ జి.శ్రీనివాసరావు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

వడదెబ్బతో నాయీ బ్రాహ్మణుడు మృతి



మరణించిన లక్ష్మణరావు

గొల్లప్రోలురూరల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): బాజా భజంత్రీలు వాయిస్తూ వడదెబ్బకు గురై కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం ఏకే మల్లవరానికి చెందిన నాయీ బ్రా హ్మణుడు మరణించాడు. గ్రామానికి చెంది న నందిపర్తి లక్ష్మణరావు (50) దుర్గాదేవి ప్రతిష్ఠా కార్యక్రమంలో బాజా భజంత్రీలకు గురువారం వెళ్లాడు. భజంత్రీలు మోగిస్తుండగా ఎండ తీవ్రత తాళలేక వడదెబ్బ తగి లి కుప్పకూలిపోయాడు. పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మరణించాడు. లక్ష్మణరావుకు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. గొల్లప్రోలు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

4.50 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం స్వాధీనం

గొల్లప్రోలురూరల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం వన్నెపూడిలో ఆటోలో పీడీఎస్ బియ్యం తరలిస్తున్నారన్న సమాచారంతో ఎస్ఐ రామకృష్ణ ఆ ధ్వర్యంలో పోలీసులు గురువారం తెల్లవారుజామున దాడి చేశారు. 4.50 క్వింటాళ్ల రేషన్ బియ్యం, ఆటోను స్వాధీనం చేసుకుని సరుకు యజమాని కర్రి లక్ష్మీనారాయణను అరెస్టు చేశారు. గొల్లప్రోలు ఎస్ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉప్పాడలో రెండు టన్నుల బియ్యం స్వాధీనం

కొత్తపల్లి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కొత్తపల్లి పోలీసులు గురువారం రాత్రి ఉప్పాడలో రెండు టన్నుల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. గాంధీనగర్‌లో చిత్రాడ దొరబాబు వద్ద నిల్వ ఉంచిన ఈ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

ఆస్తి పన్నుపై వడ్డీ రాయితీ గడువు పొడిగింపు

కార్పొరేషన్ (కాకినాడ), ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): 2024-25 సంవత్సరానికి ఏక మొత్తంగా చెల్లించే ఆస్తి పన్ను వడ్డీపై 50శాతం రాయితీని ఈ నెలాఖరు వరకు పొడిగిస్తున్నట్టు కమిషనరు భావన తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరం మొత్తానికి ఆస్తి పన్నును ఏప్రిల్ 30 నాటికి ఏకంగా చెల్లించిన వారికి ఆస్తి పన్నులో 5శాతం రాయితీ లభిస్తుందన్నారు. చెల్లింపుదారులకు సౌలభ్యంగా 19 అదనపు కలెక్షన్ కౌంటర్లు ఏర్పాటు చేశామని, ప్రతిరోజూ (సెలవుల్లో కూడా) ఉదయం 10 నుంచి రాత్రి 7 గంటల వరకు పనిచేస్తాయని చెప్పారు.



పిఠాపురం మండలం చిత్రాడలో స్టాక్ పాయింటు రికార్డులను పరిశీలిస్తున్న జేసీ రాహుల్‌మీనా

ఇసుక స్టాక్ పాయింట్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి: జేసీ

పిఠాపురం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఇసుక స్టాక్ పాయింట్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా ఆదేశించారు. మండలంలోని చిత్రాడ శివారులో 216వ జాతీయ రహదారి చెంతనే ఉన్న స్టాక్ పాయింట్‌ను ఆయన గురువారం సాయంత్రం పరిశీలించారు. స్టాక్ పాయింట్‌కు వస్తున్న ఇసుక, విక్రయాలకు సంబంధించిన రికార్డులను అందుబాటులో ఉంచాలని సూచించారు. అనంతరం పట్టణంలోని పాదగయ వద్ద ఉన్న సివిల్ సప్లయిస్ స్టాక్ పాయింట్‌ను పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్‌లో వివరాలను తనిఖీ చేశారు. సరుకు బయటకు పంపే సమయంలో బయోమెట్రిక్ తప్పనిసరని స్పష్టం చేశారు. జేసీ వెంట పిఠాపురం తహసీల్దారు వీవీ గోపాలకృష్ణ, ఆర్ఐ వెంకటేష్ ఉన్నారు.

రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేస్తాం

గొల్లప్రోలు (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన పంటను కనీస మద్దతు ధరకు కొనుగోలు చేస్తామని జేసీ రాహుల్‌మీనా తెలిపారు. గొల్లప్రోలు మండల పరిషత్ కార్యాలయంలోని రైతు సేవా కేంద్రం-1ను ఆయన గురువారం సాయంత్రం పరిశీలించి ధాన్యం కొనుగోళ్లపై ఆరా తీశారు. జిల్లా సివిల్ సప్లయిస్ అధికారి ఎండీ నాయక్, డీసీవో మురళీకృష్ణ, తహసీల్దారు సత్యనారాయణ, ఏవో అచ్యుతరావు, సొసైటీ సీఈవో సూరిబాబు ఉన్నారు.



విజయవాడలో కాకినాడ కమిషనర్ భావనను సత్కరిస్తున్న దృశ్యం

పన్నుల వసూళ్లలో 'కాకినాడ' స్టేట్ సెకండ్

కార్పొరేషన్(కాకినాడ), ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ పాపర్టీస్ వసూళ్లలో కార్పొరేషన్లలో రాష్ట్ర స్థాయిలో రెండో స్థానం, ప్రభుత్వ సంస్థలు, ప్రైవేట్, ఖాళీ స్థలాల పన్ను వసూళ్లలో రాష్ట్రస్థాయిలో నాల్గవ స్థానం కాకినాడ నగరపాలక సంస్థకు దక్కింది. కమిషనరు భావనను పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ గురువారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో అభినందించారు.



కలెక్టర్ షాన్ మోహన్ నుంచి అవార్డులు అందుకుంటున్న ఎంపీడీవో సతీష్, ఏపీవో గణేష్

ఉపాధి హామీలో 'కాకినాడ రూరల్'కు మూడో స్థానం

సర్పవరం జంక్షన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సాధించడంలో కాకినాడ రూరల్ మండలం జిల్లాలో మూడో స్థానంలో నిలిచింది. ఎంపీడీవో పసుపులేటి సతీష్, ఏపీవో గణేష్‌లకు గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ షాన్‌మోహన్ అవార్డులు అందజేశారు. డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

సాధికార సారథులను నియమించాలి: మాజీ ఎమ్మెల్యే వర్మ

గొల్లప్రోలు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రతి బూత్‌లో 60 ఓటర్లకు ఒక పురుషుడు, ఒక మహిళ వంతున కుటుంబ సాధికార సారథులను నియమించాలని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ సూచించారు. గురువారం ఆయన స్థానిక నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. పార్టీ సభ్యత్వం ఉన్న వారే సారథులుగా ఉండేందుకు అర్హు లని చెప్పారు. భవిష్యత్తులో మరిన్ని పదవులు పొందేందుకు ఇది ప్రధాన అర్హత కానుందని తెలిపారు.సమావేశంలో తెలుగుదేశం పార్టీ పట్టణ శాఖ అధ్యక్షుడు గుండ్ర సుబ్బారావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ ధర పెంపుపై సీపీఐ నిరసన

కాకినాడ సిటీ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్, కరెంటు ఛార్జీలతో పాటు వంట గ్యాస్‌పై రూ.50 పెంచడాన్ని నిరసిస్తూ సీపీఐ కాకినాడ జిల్లా సమితి ఆధ్వర్యంలో గురువారం మదర్ థెరిస్సా బొమ్మ సెంటర్ వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. కట్టెలు, సిలిండర్‌ను ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తాటిపాక మధు మాట్లాడుతూ అటు మోదీ, ఇటు కూటమి ప్రభుత్వాల దెబ్బకు ప్రజల జీవన విధానం కుదేలైందని విమర్శించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కె.బోడకొండ, సహాయ కార్యదర్శి తోకల ప్రసాద్, ఏపీ మహిళా సమాఖ్య జిల్లా కన్వీనర్ ఎ.భవాని, సీపీఐ నాయకులు పప్పు ఆదినారాయణ, కేశవరపు అప్పలరాజు, టి.అన్నవరం, ఏఐఎస్ఎఫ్, ఏఐటీయూసీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'ఆత్మవిశ్వాసం పెంచేందుకు యోగా దోహదం'

సర్పవరం జంక్షన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): సంపూర్ణ ఆరోగ్యం, యువతకు ఆత్మవిశ్వాసం, మానసిక స్థైరాన్ని కల్పించడంలో యోగా ఒక సాధనమని యోగా గురువు, అనుష్టాన యోగా ట్రస్టు వ్యవస్థాపకుడు కె.అర్జున పేర్కొన్నారు. గురువారం తిమ్మాపురం అక్నూ ఎంఎస్ఎన్ పీజీ క్యాంపస్‌లో ప్రిన్సిపాల్ ఎస్.ప్రశాంతిశ్రీ ఆధ్వర్యంలో స్ట్రెస్ ఫ్రీ విత్ యోగాపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అర్జున మాట్లాడుతూ ఆధునిక కాలంలో ఒత్తిడి, ఆందోళన, నిద్రలేమి వంటి సమస్యలతో యువత, విద్యార్థులు, ఉద్యోగులు బాధపడుతున్నారన్నారు. ఆత్మహత్యలకు పాల్పడకుండా, మానసిక ధైర్యం, సానుకూల ఆలోచనలు, మానసిక సమస్యలను అధిగమించేందుకు యోగా ఉపయోగపడుతుందన్నారు. పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

'ఎస్సీ వర్గీకరణకు మాలమహానాడు వ్యతిరేకం'

కలెక్టరేట్ (కాకినాడ), ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాలమహానాడు ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట గురువారం నిరసన తెలిపారు. మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు (రాక్స్) రత్నాకర్ మాట్లాడుతూ దేశంలో ఎస్సీలపై కుట్ర జరుగుతోందని ధ్వజమెత్తారు. తెలంగాణలో ఎస్సీ వర్గీకరణ బిల్లును రాష్ట్రపతి ఆమోదానికి పంపకుండా గవర్నర్ ఎలా ఆమోదించారని ప్రశ్నించారు. ఎస్సీ వర్గీకరణ వల్ల మాలలు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్‌కు వినతిపత్రం ఇచ్చారు. మాలమహానాడు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డాక్టర్ సీతారామస్వామికి నివాళి

కార్పొరేషన్ (కాకినాడ), ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): పిఠాపురానికి చెందిన ప్రముఖ వైద్యుడు, సాహితీవేత్త, వక్త డాక్టర్ గజరావు సీతారామస్వామి గత నెల 26న పరమపదించారు. గురువారం గాంధీభవన్‌లో ఆయన సంస్మరణ సభ ఏర్పాటు చేశారు. డాక్టర్ సీతారామస్వామి చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు.



ఎయిర్‌పోర్టు, క్రికెట్ స్టేడియం అంశాలను ఎంపీ సతీష్‌బాబుకు వివరిస్తున్న కరప మండల కూటమి నేతలు



కాకినాడలోని క్యాంపు కార్యాలయంలో ఎంపీ సతీష్‌బాబుకి వినతిపత్రం ఇస్తున్న పాస్టర్లు

ఎంపీ సతీష్‌బాబును కలిసిన కూటమి నేతలు, పాస్టర్లు

కరప, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబును పలువురు కూటమి నేతలు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. మండలంలోని గురజనాపల్లి, పెనుగుదురు గ్రామాల్లో వెయ్యి ఎకరాలకు పైగా సాల్ట్ భూముల్లో ఎయిర్‌పోర్టు, ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం నిర్మాణాలపై చర్చించారు. ఈ భూముల్లో ఎయిర్‌పోర్టు నిర్మిస్తే ఉమ్మడి కోనసీమ, కాకినాడ జిల్లాలకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని, క్రికెట్ స్టేడియానికి అవసరమైన అన్ని హంగులూ ఇక్కడ ఉన్నాయని తెలిపారు. ఎయిర్‌పోర్టు నిర్మాణం అంశంపై ప్రభుత్వం సమాలోచనలు జరుపుతోందని, క్రికెట్ స్టేడియం అంశాన్ని అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్తానని ఎంపీ హామీ ఇచ్చారు. కూటమి నాయకులు నులుకుర్తి వెంకటేశ్వరరావు, దేవు వెంకటేశ్వరరావు, బుద్దాల సత్తిబాబు, వెలుగుబంట్ల సూరిబాబు, పితాని జయరామ్, అనిశెట్టి గంగాధర్, వెలుగుబంట్ల గంగాధర్ తదితరులు ఎంపీని కలిసిన వారిలో ఉన్నారు.

కాకినాడ సిటీ (ఆంధ్రజ్యోతి): పాస్టర్లకు గౌరవ వేతనం జీవోను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విడుదల చేసినా ఇంతవరకు తమ ఖాతాలో డబ్బులు జమ కాలేదని, ప్రభుత్వంతో మాట్లాడి జమయ్యేలా సహకరించాలని రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబును పాస్టర్లు కోరారు. నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ కాకినాడ జిల్లా అధ్యక్షుడు మోసా అబ్రహం ఆధ్వర్యంలో పాస్టర్లు ఎంపీని కలిసి ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. ఎంపీ స్పందిస్తూ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఈస్టర్‌లోగా పాస్టర్లకు గౌరవ వేతనం వారి ఖాతాల్లో జమయ్యేలా కృషి చేస్తానన్నారు. ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం క్రైస్తవులకు అండగా ఉంటుందన్నారు. నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ జిల్లా ఉపాధ్యక్షుడు మోజెస్‌కుమార్, జిల్లా కో-ఆర్డినేటర్ ఎస్.ప్రభాకర్, నగర ప్రధాన కార్యదర్శి జయ్‌కుమార్, టీడీపీ నాయకుడు కామాడి దశరధ, క్రైస్తవ నాయకులు పాల్గొన్నారు.

వక్ఫ్ చట్ట సవరణ రాజ్యాంగ ఉల్లంఘనే

సీపీఎం రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు

కాకినాడ సిటీ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో తాజాగా ఆమోదించిన వక్ఫ్ చట్ట సవరణ రాజ్యాంగ ఉల్లంఘనేనని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. నగరంలోని సుందరయ్యభవన్‌లో గురువారం సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సీపీఎం జిల్లా కార్యదర్శి కరణం ప్రసాదరావు అధ్యక్షతన 'వక్ఫ్ చట్ట సవరణ-మైనారిటీలపై దాడి' అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. న్యాయవాది జవహర్ అలీ మాట్లాడుతూ వక్ఫ్ చట్టంలో 44 సెక్షన్లు సవరించారని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న జవహర్ అలీ

పలు సంఘాల నేతలు సీహెచ్ నాగేశ్వరరావు, గొడుగు సత్యనారాయణ, జె.వెంకటేశ్వర్లు, బషీరుద్దీన్, ఇక్బాల్, దూసర్లపూడి రమణరాజు, తాళ్లూరి రాజు, పిట్టా వరప్రసాద్ మాట్లాడుతూ వక్ఫ్ చట్ట సవరణను రాజ్యాంగంపై జరుగుతున్న దాడిగా చూడాలన్నారు. సమావేశంలో నాయకులు దువ్వా శేషుబాబ్జీ, పలివెల వీరబాబు, మలక వెంకటరమణ, మేడిశెట్టి వెంకటరమణ, నీలపాల సూరిబాబు, బి.జయప్రకాష్, ఇయావుద్దీన్, సీహెచ్ రమణి, కె.నాగజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్ విశ్రాంత వైద్యుడు

డాక్టర్ సలీం మృతి



జీజీహెచ్ (కాకినాడ), ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జీజీహెచ్‌లో సుదీర్ఘ కాలం వైద్య సేవలు అందించిన డాక్టర్ మహ్మద్ అబ్దుల్ సలీం (69) అనారోగ్యంతో గురువారం మరణించారు. రంగరాయ వైద్య కళాశాల 1976 బ్యాచ్ ఎంబీబీఎస్ విద్యార్థి అయిన ఆయన సివిల్ అసిస్టెంట్ సర్జన్ హోదాలో 2017లో రిటైర్ అయ్యారు. జీజీహెచ్‌లో క్యాజువాలిటీ మెడికల్ ఆఫీసర్ (సీఎంవో)గా ఎక్కువ కాలం పని చేశారు. ఆర్ఎంవోగాను, ఏడీగానూ విధులు నిర్వర్తించారు. కొవిడ్ సమయంలో వలంటీర్‌గా జీజీహెచ్‌లో వైద్య సేవలు అందించారు. డాక్టర్ సలీం భౌతికకాయానికి ప్రభుత్వ, ప్రైవేటు వైద్యులు నివాళులర్పించారు.

'ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులను చేర్పించాలి'

కరప, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): అన్ని వసతులు ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులను చేర్పించాలని ఎంఈవోలు కొప్పుల బులికృష్ణవేణి, పత్తి సత్యనారాయణ కోరారు. గురువారం వారు గురజనాపల్లి హైస్కూల్‌లో హెచ్ఎం ఎం.సాయిమోహన్ ఆధ్వర్యంలో ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌ను ప్రారంభించారు. సర్పంచ్ అనుసూరి శ్రీనివాసరావు, ఎస్ఎంసీ చైర్మన్ పి.నూకరాజు, యూటీఎఫ్ నాయకుడు ఐ.ప్రసాదరావు, ఉపాధ్యాయులు కేవీ రమణి, యు.రాజీవ్‌కుమార్, పీవీ రమణమూర్తి, వీవీ రమణమూర్తి, టి.వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల తనిఖీలు

గొల్లప్రోలు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు పట్టణ శివారులోని టోల్‌ప్లాజా వద్ద 216 జాతీయ రహదారిపై గురువారం రాత్రి పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. వాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని పిఠాపురం సీఐ శ్రీనివాస్ స్పష్టం చేశారు. డ్రైవింగ్ లైసెన్సు, సి-బుక్, ఇన్సూరెన్స్, పొల్యూషన్ సర్టిఫికెట్ వాహనంతో పాటు ఉండాలని తెలిపారు. ఇవి లేకుంటే జరిమానా విధించడంతో పాటు సీజ్ చేస్తామని హెచ్చరించారు. గొల్లప్రోలు, పిఠాపురం ఎస్ఐలు రామకృష్ణ, మణికుమార్ పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

కరప, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): జాతీయ సర్వేయర్ల దినోత్సవం సందర్భంగా గురువారం కరప తహసీల్దారు కార్యాలయం వద్ద మండల సర్వేయర్ శృంగారపు రూప, గ్రామ సర్వేయర్లు సంయుక్తంగా చలివేంద్రాన్ని ఏర్పాటుచేశారు. దీనిని తహసీల్దారు నందిపాటి సత్యనారాయణ ప్రారంభించి పాదచారులు, ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేశారు. డిప్యూటీ తహసీల్దారు డి.దుర్గాప్రసాద్, ఆర్ఐ సీహెచ్ పవన్, వీఆర్వోలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

సీపీఐ ప్రచార జాతా

సామర్లకోట, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలని కోరుతూ సీపీఐ పట్టణ శాఖ ఆధ్వర్యంలో గురువారం ప్రచార జాతా నిర్వహించారు. సీపీఐ జిల్లా నాయకులు కేశవరపు అప్పలరాజు, సూరిబాబు, రమణ, సత్యనారాయణ, చిట్టిబాబు, ఏఐవైఎఫ్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మార్క్ శంకర్ కోలుకోవాలని పూజలు

పిఠాపురం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): సింగపూర్‌లోని ఒక పాఠశాలలో జరిగిన అగ్ని ప్రమాదంలో గాయపడ్డ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చిన్న కుమారుడు మార్క్ శంకర్‌కు సంపూర్ణ ఆరోగ్యం చేకూరాలని ప్రార్థిస్తూ పట్టణంలోని శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానంలో జనసేన నాయకులు అభిషేకాలు, విశేష పూజలు జరిపించారు. జనసేన నాయకుడు చెల్లుబోయిన సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కోలా దుర్గాదేవి, రావుల వరలక్ష్మి, రమణ, తోలేటి శిరీష, పిల్లా రమ్యజ్యోతి, బాలిపల్లి రాంబాబు, రెడ్డెం జనార్దన్ తదితరులు పాల్గొన్నారు. పాదగయ క్షేత్రంలో దత్తాత్రేయ స్వామికి దివ్యాంగులు పూజలు చేశారు. మార్క్ శంకర్ ఆరోగ్యంతో ఉండాలని ప్రార్థించారు.



శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానంలో పూజలు చేస్తున్న జనసేన నాయకులు

ఘనంగా మహావీర్ జయంతి

కాకినాడ సిటీ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మానవాళికి శాంతి, అహింసలతో కూడిన గొప్ప సందేశాన్ని అందించిన మహావీర్‌ను స్ఫూర్తిగా తీసుకుని శాంతియుత సమాజ స్థాపనకు కృషి చేయాలని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పేర్కొన్నారు. స్థానిక జైన్ భవన్‌లో గురువారం కాకినాడ జైన్ బ్యాంకర్స్, మర్చంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహావీర్ జయంతి కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మహావీర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అహింస, సత్యం వంటి పంచసూత్రాలను ప్రబోధించిన గొప్ప మహనీయుడు మహావీర్ అని కొనియాడారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్ సంఘవి, గౌరవ అధ్యక్షుడు భవర్‌లాల్ జైన్, అమన్ జైన్ విక్రమ్ జైన్, తిలోక్‌చంద్ జైన్, అంబాలాల్ తదితరులు పాల్గొన్నారు.



మహావీర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కొండబాబు



నూతనంగా ఎన్నికైన పెద్దాపురం సమితి యూనిట్ కార్యవర్గ సభ్యులు

ప్రశాంతంగా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఎన్నికలు

పెద్దాపురం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం పెద్దాపురం సమితి యూనిట్ ఎన్నికలు నిర్వహించారు. పరిశీలకులుగా జిల్లా అధ్యక్షుడు జగన్నాథం, జనరల్ సెక్రటరీ జ్యోతుల రాంబాబు, అసోసియేట్ ప్రెసిడెంట్ రత్నరాజు హాజరయ్యారు. ప్రెసిడెంట్‌గా ఎన్వీఈ ప్రసాద్, సెక్రటరీగా టి.శ్రీనివాసరావు, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా బి.ప్రకాశరావు, ట్రెజరర్‌గా జి.రాజా, ఆర్గనైజింగ్ సెక్రటరీగా బి.అభిషేక్‌తో పాటు వైస్ ప్రెసిడెంట్స్, జాయింట్ సెక్రటరీలను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గానికి పలువురు అభినందనలు తెలిపారు.

నూకాలమ్మ ఆలయం వద్ద అన్నదానం

కాకినాడ సిటీ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పెద్ద మార్కెట్ ఏరియాలో నూకాలమ్మవారి జాతర మహోత్సవాలు ముగింపు సందర్భంగా గురువారం వర్తకులు, దాతల సహకారంతో సుమారు 6వేల మందికి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమాన్ని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు ప్రారంభించారు. ఈవో వీరభద్రరావు, ఆలయ కమిటీ సభ్యులు అయినాల వెంకటరమణ, పినిశెట్టి శ్రీనివాసరావు, చింతలపూడి రవి, అమలకంటి బలరాం, రెడ్నం సత్తిబాబు, కోడూరి కుమారస్వామి, గుర్రాల శ్రీనివాసరావు, టీడీపీ నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, కూటమి నాయకులు గ్రంధి నారాయణరావు (బాబ్జీ), గదుల సాయిబాబు, గాది శివరామకృష్ణ, గంజి గోపి, వై.మాలకొండయ్య, చెక్కా రమేష్, డి.వీరేంద్ర, రవి, బంగారు సత్యనారాయణ, పొంగా బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి (ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి ఉత్సవాలను పురస్కరించుకుని వాకతిప్ప రామాలయం వద్ద గురువారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. వాకతిప్ప, పరిసర గ్రామాలకు చెందిన ప్రజలు హాజరై అన్నప్రసాదం స్వీకరించారు.

కనుల పండువగా సీతారామస్వామి రథోత్సవం

గొల్లప్రోలు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలులో సీతారాముల రథోత్సవం గురువారం రాత్రి కనుల పండువగా జరిగింది. తొలుత ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రథంపై ఉంచి ప్రధాన రహదారుల మీదుగా మండల పరిషత్ కార్యాలయం వరకు లాగి తిరిగి తహసీల్దారు కార్యాలయం వద్దకు తీసుకువచ్చి నిలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భారీగా బాణసంచా కాల్చారు. రథోత్సవానికి ముందు గొల్లపూడి కృష్ణ తదితరులు పూజలు జరిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు

అంతరాయం

కాకినాడ సిటీ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): డెయిరీఫారమ్ ఏరియాలోని 33/11కేవీ పోర్ట్ విద్యుత్ ఉప కేంద్రం పరిధిలో 11కేవీ బీచ్ రోడ్ ఫీడర్‌లో మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎన్.ఉదయ్‌భాస్కర్ తెలిపారు. బీచ్ రోడ్ ఫీడర్ పరిధిలోని సంజయ్‌నగర్, పర్లోవపేట, రాజీవ్ గృహకల్ప అపార్టుమెంట్లు, పాత పోర్ట్ రైల్వే స్టేషన్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

పిఠాపురం రూరల్ (ఆంధ్రజోతి): పిఠాపురం మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ పెద్దాపురం ఈఈ ప్రభాకర్ తెలిపారు. పిఠాపురం, కుమారపురం విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కారణంగా నరసింగపురం, జములపల్లి, కోలంక, కుమారపురం, ఎఫ్‌కేపాలెం గ్రామాల్లో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండ దని చెప్పారు.

సామర్లకోట (ఆంధ్రజ్యోతి): మాధవపట్నం సబ్ స్టేషన్ వార్షిక మరమ్మతుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పెద్దాపురం ఈఈ ప్రభాకర్ తెలిపారు. మామిళ్లదొడ్డి, మాధవపట్నం, వీకే రాయపురం, బోయినపూడి, ఆటోనగర్, రామేశ్వరం ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి వరకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

ఐవోబీ పెనుమర్తి శాఖ ప్రారంభం

సర్పవరం జంక్షన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయిలో ప్రభుత్వ లక్ష్యాలు విజయవంతం కావడానికి బ్యాంకులు ఎంతగానో దోహదపడుతున్నాయని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు సీనియర్ ప్రాంతీయ మేనేజరు బిజయ్ కేతన్ సాహూ అన్నారు. రమణయ్యపేట ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు ఆధ్వర్యంలో ఆధునికీకరించిన పెనుమర్తి శాఖను గురువారం ఆయన ప్రారంభించారు. వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మేనేజరు బి.ఫణీంద్ర, చీఫ్ మేనేజరు డి.శ్రీనివాసరావు, ఏజీఎస్‌బీ శివరామకృష్ణ, మేనేజర్లు కేవీవీ ప్రసాద్, రవికుమార్, శివ, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు దరఖాస్తులను త్వరితగతిన

పరిష్కరించాలి : ఆర్డీవో

కరప, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఓటు నమోదు, జాబితాలో చేర్పులు, మార్పులు కోరుతూ ఓటర్ల నుంచి వచ్చే దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని కాకినాడ ఆర్డీవో ఎస్.మల్లిబాబు సూచించారు. కరప చంద్రన్న సమావేశ మందిరంలో గురువారం సాయంత్రం ఆయన బీఎల్‌వోలతో సమావేశమయ్యారు. మృతులను తొలగించి ఓటర్ల జాబితాను పారదర్శకంగా రూపొందించాలన్నారు. ఫారమ్ 6, 6(ఎ), 7, 8 లకు సంబంధించి పలు సూచనలు చేశారు. తహసీల్దారు నందిపాటి సత్యనారాయణ, ఎంపీడీవో మట్టపర్తి అనుపమ, ఆర్ఐ సీహెచ్ పవన్, వీఆర్వోలు పాల్గొన్నారు.

15 ధాన్యం కొనుగోలు కేంద్రాలు

కరప, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతు సేవా కేంద్రాల్లో 15 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు ఏవో అప్పసాని వెంకటరాజేష్ తెలిపారు. అవసరమైన సిబ్బందిని, ఎక్విప్‌మెంట్ సమకూర్చామన్నారు. నిర్దేశిత నాణ్యతాప్రమాణాలను అనుసరించి కామన్ గ్రేడ్ రకానికి కనీస మద్దతు ధర క్వింటాకు రూ.2,300, ఎ-గ్రేడ్ రకానికి క్వింటాకు రూ.2,320 చెల్లిస్తామని వివరించారు. గోనెసంచులు, హమాలీ, రవాణ ఖర్చులను రైతుల ఖాతాకు జమ చేస్తామన్నారు.

నేత్ర వైద్య శిబిరం

కరప, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): కాజులూరు మండలం కోలంకలో బాబా యువజన సంఘం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని విశ్రాంత ఉపాధ్యాయుడు గుత్తాల శ్రీరాములు ప్రారంభించారు. కాకినాడ కిరణ్ కంటి ఆసుపత్రి వైద్యులు 200 మందిని పరీక్షించి 30 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. మరో 30 మందికి కళ్లజోళ్లు అందజేశారు. బాబా యువజన సంఘం ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ గుంటూరు మాణిక్యాలరావు, వైద్యులు నాగేశ్వరరావు, శివ, స్థానిక నాయకులు పచ్చిపాల ఏడుకొండలు, కొల్లి రాంబాబు, వినకోటి కిరణ్, ప్రసాద్ పాల్గొన్నారు.

ఏలేశ్వరంలో అన్నసమారాధన

ఏలేశ్వరం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక వీరవెంకట సత్యనారాయణస్వామి ఆలయ ప్రాంగణంలో గురువారం అన్నదానం చేశారు. శ్రీరామనవమి వేడుకలు ముగింపు సందర్భంగా నగర పంచాయతీ కౌన్సిలర్ సామంతుల సూర్యకుమార్, హైమావతి దంపతుల నేతృత్వంలో ఏర్పాటుచేసిన అన్నదానాన్ని భక్తులు స్వీకరించారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

నిర్వాసితుల అభిప్రాయ సేకరణ



పోలవరం ముంపు ప్రాంతవాసుల అభిప్రాయాలను తెలుసుకుంటున్న చింతూరు ఐటీడీఏ పీఓ అపూర్వభరత్

చింతూరు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): పోలవరం ముంపునకు సంబంధించి ప్రతి నిర్వాసితుడికి పునరావాసం, భృతితో పాటు మౌలిక సదుపాయాలు ప్రభుత్వం కల్పించనున్నట్లు చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వ భరత్ అన్నారు. చింతూరు ఐటీడీఏ ప్రాంగణంలో గురువారం నిర్వాసితుల అభిప్రాయ సేకరణ నిర్వహించారు. దీనికి చింతూరు డివిజన్ పరిధిలోని ఫేజ్ 1-బీలో ముంపునకు గురికానున్న 32 గ్రామాల ప్రజాప్రతినిధులు, పీసా సభ్యులు, గ్రామ పెద్దలు హాజరై వారి అభిప్రాయాలను పీవో దృష్టికి తీసుకెళ్లారు. ఈసందర్భంగా పీవో పలు విషయాలపై నిర్వాసితులతో చర్చించారు. ఇప్పటి వరకు జరిగిన సర్వేల్లో వచ్చిన అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని వాటిపై పరిశీలన జరుగుతుందన్నారు. నిర్వా సితులు తమకు చెందిన వివరాలను సంబం ధిత గ్రామ పంచాయతీల్లో అందజేయాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్లు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

క్వారీ నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో సింహాచలం

రంపచోడవరం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో క్వారీలు లీజుకు తీసుకున్న నిర్వాహకులు ప్రభుత్వ నింబంధనలు పాటించాలని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం ఆదేశించారు. గురువారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో సబ్‌కలెక్టర్ కె.ఆర్.కల్పశ్రీతో కలిసి మైనింగ్ అధికారులు, క్వారీ నిర్వాహక ప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా పీవో మాట్లాడుతూ ఏజెన్సీ మండలాల్లో 33 క్వారీలకు 14 క్వారీలకు మాత్రమే అనుమతులు ఉన్నాయన్నారు. సబ్ కలెక్టర్ కల్పశ్రీ మాట్లాడుతూ ప్రతి క్వారీకి సొసైటీ ఏర్పాటు చేసుకుని, ప్రభుత్వం నుంచి అనుమతులు పొందాలన్నారు. కార్యక్రమంలో జిల్లా గనుల, భూగర్భ శాఖ అధికారి ఎం.ఆనంద్, సర్వేయర్ కాళిదాసు, క్వారా నిర్వాహణ ప్రతినిధి కోసూరి సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో రెండు తాటాకిళ్లు దగ్ధం



అగ్ని ప్రమాదంలో నష్టపోయిన కుటుంబం

మోతుగూడెం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మోతుగూడెం ఎస్టీ కాలనీలో గురువారం మధ్యాహ్నం రెండు తాటాకిళ్లు దగ్ధమయ్యాయి. పరమేష్, అతని భార్య దగ్గరలోని బంధువుల ఇంటికి వెళ్లారు. పిల్లలు స్కూల్‌కి వెళ్లారు. పొయ్యి సరిగా ఆర్పక పోవడంతో మంటలు చెలరేగాయి. అలాగే గాలి వీయడంతో ఆ మంటలు ప్రక్కనే ఉన్న రాము ఇంటికి కూడా వ్యాపించాయి. దీంతో భార్య పండు, ఇద్దరు పిల్లలను రాము బయటకు వచ్చి కేకలు వేశారు. దీంతో స్థానికులు వచ్చి మంటలు ఆర్పే ప్రయత్నం చేసినా రెండు ఇళ్లు పూర్తిగా కాలిపోయాయి. రెండు ఇళ్లల్లో ఉన్న మొత్తం సామగ్రి కాలి బూడిదైంది. కట్టుబట్టలతో మిగిలామని ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు. బాధితులను టీడీపీ ఎంపీటీసీ వేగి నాగేశ్వరరావు, పీసా కమిటీ సెక్రటరీ పి.సుశీల, పీసా కమిటీ ఉపాధ్యక్షుడు ఓలయ్య పరామర్శించారు.

ప్రకృతి వ్యవసాయంతో సంపూర్ణ ఆరోగ్యం

అడ్డతీగల, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతో పండించిన పంటలు తింటే సంపూర్ణ ఆరోగ్యం ఉంటారని వ్యవసాయాధికారిణి సువర్ణ కుమారి అన్నారు. అడ్డతీగల వెలుగు కార్యాలయం ఆవరణలో గురువారం వ్యవసాయ శాఖ, ఇతర అనుబంధ శాఖల ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రైతులందరూ ప్రకృతి వ్యవసాయం చేయడానికి కార్యాచరణ రూపొందించారు. ప్రకృతి వ్యవసాయం వల్ల మంచి ఆరోగ్యంతో ఆదాయం, ఆనందం సమకూరుతాయని ఎంఈవో శ్రీనివాస్ సూచించారు. 2025 సంవత్సరం కేపీపీ ప్రణాళిక, ప్రతి గ్రామంలో ఉన్న పంటల విస్తీర్ణం ఆధారంగా సర్వే నిర్వహించాలని, మొత్తం విస్తీర్ణానికి నవధాన్యాలు కొనుగోలు కోసం గ్రామ సంఘంలో రుణాలు తీసుకుని పీఎండీఎస్ కిట్స్ తయారు చేసి రైతులకు అందించాలని ప్రకృతి విభాగం గంగరాజుకు సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పర్యాటక ప్రాంత అభివృద్ధి ముసుగులో 1/70 చట్టానికి తూట్లు

రంపచోడవరం, ఏప్రిల్ 10 (ఆంధ్రజోతి): ఆదివాసీ చట్టాలను పకడ్బందీగా అమలు చేసి, వారి హక్కులను భంగం వాటిల్లకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటే సరిపోతుందని ఆదివాసీ కూటమి నాయకులు, ఆదివాసీ చైతన్య వేదిక అధ్యక్షుడు వెదుళ్ల లచ్చిరెడ్డి, ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షుడు తీగల బాబురావు అన్నారు. ప్రభుత్వం టూరిజం అభివృద్ధి ముసుగులో 1/70 చట్టాన్ని నిర్వీర్యం చేస్తోందని, గతంలో స్పీకర్ అయ్యన్న పాత్రుడు మాట్లాడిన తీరు, అసెంబ్లీలో ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి మాట్లాడిన తీరు, గతంలో వైసీపీ ప్రభుత్వం అనుసరించిన విధానం ఒకటేనని అన్నారు. గిరిజన ప్రాంత వనరులపై పూర్తి హక్కులు ఆదివాసీలకే ఉన్నాయన్నారు. ఏజెన్సీ ప్రాంతంపై ప్రభుత్వానికి మక్కువ ఉంటే జీవో నెం.3 స్థానంలో మరో జీవోను తీసుకువచ్చి గిరిజన యువతకు నూరు శాతం ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు కారం రామన్నదొర, తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామగిరి కొండపై ప్రత్యేక పూజలు

వీఆర్‌పురం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీరామగిరి కొండపై కొలువై ఉన్న శ్రీసుందర సీతారామచంద్రస్వామి వారి దొంగల దోపోత్సవం బుధవారం రాత్రి వైభవంగా జరిగింది. శ్రీసీతారాముల కల్యాణం జరిగిన తరువాత నాల్గవ రోజు రాత్రి దొంగల దోపోత్సవం నిర్వహించారు. ముందుగా స్వామివారిని బుధవారం రాత్రి 11 గంటలకు ఆయా వీధుల్లో మంగళ వాయిద్యాలతో భక్తులు గోదావరి నదికి తీసువచ్చారు. గోదావరి నదిలో ఏర్పాటు చేసిన బోట్‌లో స్వామివారిని ఆశీనులు గావించారు. అనంతరం స్వామివార్ని భజన పాటలతో గోదావరి నది అవతల ఒడ్డుకు తీసుకవెళ్లి దొంగల దోపోత్సవం కార్యక్రమం నిర్వహించారు. తరువాత స్వామివారిని తీసుకువచ్చి ఆలయంలో ఆశీనులు గావించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పెందుర్తి సుదర్శన్, ఆలయ అధికారి సాయిబాబు, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.



స్వామివారికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

అమరవీరుల స్ఫూర్తితో సమస్యలపై పోరాటాలు

ఎటపాక, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): అమరవీరుల స్ఫూర్తితో ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు సాగిస్తామని సీపీఎం మండల కార్యదర్శి కాక అర్జున్‌దొర, బీటీజీ తిలక్ అన్నారు. కామ్రేడ్ బండారు సత్యనారాయణ 33వ వర్ధంతిని గురువారం గోళ్లగట్ట గ్రామంలో నిర్వహించారు. ఈసభలో తొలుత కామ్రేడ్ స్టాలిన్ జెండా ఆవిష్కరణ చేశారు. గ్రామ స్థాయిలో ప్రజా సమస్యలు గుర్తించి పరిష్కారానికి చర్యలు చూపాలన్నారు. ప్రజల్లో నిరంతరం ఉంటే పార్టీ కూడా బలోపేతం అవుతుంద న్నారు. కార్యక్రమంలో ఐవీ, తెలంగాణ సీపీఎం నాయకులు యుండ నర్సారెడ్డి, బండారు శరత్‌బాబు, భద్రాచలం పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి తదితరులు పాల్గొన్నారు.



బండారు సత్యనారాయణ చిత్రపటం వద్ద నివాళర్పిస్తున్న దృశ్యం

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

సీఎం సహాయ నిధి చెక్కులు అందజేత

జగ్గంపేట, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక రావులమ్మనగర్‌లోని టీడీపీ కార్యాలయంలో పలువురికి సీఎం సహాయ నిధి చెక్కులను జగ్గంపేట ఎమ్మెల్యే, టీడీపీ పాలక మండలి సభ్యుడు జ్యోతుల నెహ్రూ గురువారం పంపిణీ చేశారు. గండేపల్లి మండలం జెడ్‌రాగంపేటకు చెందిన బొడ్డు వెంకట శ్రీనివాస్‌కు కిడ్నీ మార్పిడి ఆపరేషన్‌కు రూ.7,83,346 చెక్కును, కిర్లంపూడి మండలం తామరాడకు చెందిన పంచాది కొండలరావుకు రూ.లక్ష, కాట్రావులపల్లికి చెందిన బోయిన వరలక్ష్మికి రూ.1,08,601, గిడియాల రాజారావుకు రూ.48వేలు చెక్కులను అందించారు. కార్యక్రమంలో కందుల చిట్టిబాబు, అనుకూల శ్రీకాంత్, కందుల కొండయ్య చౌదరి (బాబ్జీ) ఉండవల్లి వరప్రసాద్, సుంకర సీతారామయ్య, తదితరులు పాల్గొన్నారు.



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

ఉపాధి పనుల్లో జిల్లాలో గండేపల్లికి రెండో స్థానం

జిల్లా కలెక్టర్ నుంచి అవార్డు అందుకున్న ఎంపీడీవో

గండేపల్లి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి అతి ముఖ్యమైన 12 రకాల పేరామీటర్స్‌లో గండేపల్లి మండలం జిల్లాలో 2వ స్థానంలో ఉన్నందున గురువారం కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్ గండేపల్లి ఎంపీడీవో నాతి బుజ్జిని అభినందిస్తూ అవార్డు అందించారు. మండలంలో వేతనదారుల ప్రతీ కుటుంబానికి సరాసరి పనికల్పనలో 62.16 శాతం పనిదినాలు పూర్తిచేయడంలో గండేపల్లి మండలం మొదటి స్థానంలో ఉందన్నారు. వేతనదారులకు పని దినాలు కల్పించడం, వంద రోజుల పని పూర్తి చేయడం, వికలాంగ, ఎస్సీ కుటుంబాల వేతనదారులకు పని కల్పించడంలో రెండవ స్థానంలో నిలిచిందన్నారు. గండేపల్లి ఎంపీడీవో నాతి బుజ్జి ఏ మండలంలో పనిచేసిన ఆ మండలానికి పేరువచ్చేలా అభివృద్ధి చెందేలా విధులు నిర్వహిస్తారు. ఇప్పటికే గండేపల్లి ఎంపీడీవో 55కిపై ఉత్తమ అవార్డులు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవోకు మండల నాయకులు పోతుల మోహనరావు, కోర్పు సాయితేజ్, జాస్తి వసంత్, కందుల చిట్టిబాబు, పరిమి బాబు, కుంచే రాజా, అధికారులు, ఉపాధి హామీ ఏపీవో రాజు, ఈసీ రమేష్, టీఏలు శ్రీను, మోహన్, శ్రీను, అబ్బులు, సిబ్బంది శేఖర్, రామన్న అభినందనలు తెలిపారు. డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి, ఏపీవో గంగాభవానీ ఉన్నారు.



అవార్డు అందుకుంటున్న ఎంపీడీవో నాతి బుజ్జి

ఎమ్మెల్యేను కలిసిన డాక్టర్ నాట్రం పూజ



ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందిస్తున్న పూజ

జగ్గంపేట, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట మండలం రాజపూడి ప్రైమరీ హెల్త్ సెంటర్ డీడీవోగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ నాట్రంపూజ జగ్గంపేట రావులమ్మనగర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూను గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పూజ మాట్లాడుతూ రాజపూడి పీహెచ్‌సీ డీడీవోగా బాధ్యతలు స్వీకరించానని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆసుపత్రికి వచ్చే రోగులకు మంచి వైద్యం అందించాలన్నారు. పీహెచ్ఎస్ లక్ష్మీకాంతం, ఎంపీహెచ్‌వో ఉమా మహేశ్వరరావు, హెల్త్ అసిస్టెంట్ ప్రకాష్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

జగ్గంపేట, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): నరేంద్రపట్నం 11కేవీ ఇర్రిపాక ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉద యం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరపరా నిలుపుదల చేస్తున్నట్లు విద్యుత్ ఏఈ వీరభద్రరావు తెలిపారు. ఇర్రిపాక, నరేంద్రపట్నం, మామిడాడ గ్రామాలకు, బోరులకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామ న్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

యనమల సభకు తరలివెళ్లిన నాయకులు

కోటనందూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): యనమల రాజకీయ ప్రస్థానంపై పుస్తకావిష్కరణకు మండలం నుంచి మండల టీడీపీ అధ్యక్షుడు గాడి రాజుబాబు ఆధ్వర్యంలో భారీగా తుని తరలివెళ్లారు. అంకంరెడ్డి రమేష్, పెంటకోట భాస్కర సత్యనారాయణ, గొర్లి అచ్చియ్యనాయుడు, వెలగవెంకట కృష్ణారావు, డి.చిరంజీవి రావు, అల్లూరి లోవరాజు, పోతల సూరిబాబు, నవాబ్‌జానీ ఉన్నారు.

రీ సర్వేతో భూ సమస్యల పరిష్కారం

రౌతులపూడి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): రీ సర్వేతో భూ సమస్యలను పరిష్కారిం చుకోవచ్చునని తహసీల్దార్ ఎస్వీ నరేష్ అన్నారు. ఉప్పంపాలెంలో రీసర్వేపై గ్రామసభ నిర్వహించారు. సర్పంచ్ వై.కోటేశ్వర రావు, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ పి.రవితేజ, మండల సర్వేయర్ వై. రాజశేఖర్, ఎస్.విష్ణుకుమారి, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గంగాలమ్మ తల్లిగావు సంబరాలు



గజ్జెనపూడిలో గంగాలమ్మ తల్లికి పూజలు చేస్తున్న మహిళలు

ప్రత్తిపాడు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): గజ్జెనపూడిలో ఎలిమెంటరీ పాఠశాల వద్ద గింజాలవారి గంగాలమ్మతల్లి గావు సంబరం గురువారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయం వద్ద గింజాల కుటుంబానికి చెందిన మహిళలతో పాటు గ్రామ మహిళలుపెద్ద ఎత్తున తరలివచ్చిప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల టీడీపీ అధ్యక్షుడు అమరాది వెంకట్రావు, పార్లమెంటరీ ఉపాధ్యక్షుడు కొమ్ముల కన్నబాబు, యాళ్ల జగదీష్, టీడీపీ నాయకులు పల్లా గోపి, జక్కా సత్తిబాబు, స్కూల్ చైర్మన్ వీరబాబు, దాకారపు కృష్ణ, పోలిశెట్టి శ్రీను, వై.గోవిందనాయుడు, రావూరి తాతాజీ, మదినేస్వామి, ఒమ్మి గంగరాజు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం భారీ అన్నదానం నిర్వహించారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

ప్రత్తిపాడు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): బీజేపీ బలోపేతానికి కార్యకర్తలు, క్రియాశీలక సభ్యులు కృషి చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ సింగిలిదేవ్ సత్తిరాజు కోరారు. స్థానిక పార్టీ కార్యాలయం వద్ద గురువారం నిర్వహించిన నియోజకవర్గ బూత్ కమిటీ, క్రియాశీలక సభ్యులు సమావేశానికి ముఖ్యఅతిథిగా కామర్సుచిరంజీవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిరంజీవి, సత్తిరాజు మాట్లాడుతూ ఈ నెల 13న స్వాతంత్ర్య పోరాటంలో అశువుల బాసిన మహత్ముల విగ్రహాలను శుభ్రపరచాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి కొల్లా శ్రీనివాస్, యువమోర్చ జిల్లా అధ్యక్షుడు చిట్ర పాపారావు, రాజా కింగ్‌బాబురాజు, వెలుగూరి హరేరామ్, ఎస్సీ మోర్చ అధ్యక్షుడు విజయ్‌కుమార్, నక్కాశ్రీను, గెడ్డం సీతారాం, దేవర రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సింగరంపాలెంలో...

విద్యుత్ ఉపకేంద్రానికి శంకుస్థాపన

గండేపల్లి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): సింగరంపాలెంలో రూ.3.29 కోట్లతో 33/11 కేవీ విద్యుత్ ఉప కేంద్రం నూతన సబ్‌స్టేషన్‌కు గురువారం ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ శంకుస్థాపన చేశారు. మండల టీడీపీ అధ్యక్షుడు పోతుల మోహనరావు తండ్రి పోతుల వీర్రాజు జ్ఞాపకార్థం ఈసబ్‌స్టేషన్ నిర్మాణానికి కావాల్సిన స్థలాన్ని 40 సెంట్లు ప్రభుత్వానికి అందించారు. ఈసందర్భంగా మోహనరావును ఎమ్మెల్యే నెహ్రూ సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే నెహ్రూ మాట్లాడుతూ గండేపల్లి మండలంలో మొత్తం ఏడు సబ్‌స్టేషన్లు ఉండగా టీడీపీ ప్రభుత్వం ఆరు నిర్మించిందన్నారు. కార్యక్రమంలో కోర్పు లచ్చయ్యదొర, ఎస్వీఎస్ అప్పలరాజు, కోర్పు సాయితేజ, అడబాల భాస్కరరావు, కొత్త కొండబాబు, కుంచే రాజా, కందుల చిట్టిబాబు, టీడీపీ మండల యువనాయకుడు జాస్తి వసంత్, ఎంపీపీ చలగళ్ల దొరబాబు, అవసరాల సుబ్రహ్మణ్యం, బొల్లంరెడ్డి రామకృష్ణ, పాలకుర్తి ఆదినారాయణ, యర్రంశెట్టి బాబ్జి, విద్యుత్ ఎస్ఈ గొర్ల ప్రసాద్, ఈఈ వీరభద్రరావు, డీఈఈ మలాకి, ఏఈ కిరణ్‌కిశోర్ పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

మాజీ ఎమ్మెల్యే శీతంశెట్టి పరామర్శ

దేవీపట్నం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): వెలగపల్లి గ్రామంలో కొంట్ల ప్రసాద్‌రెడ్డి అనారోగ్యంతో మృతిచెందాడు. రెడ్డి మృతదేహానికి రంపచోడవరం మాజీ ఎమ్మెల్యే శీతంశెట్టి వెంకటేశ్వరరావు నివాళులర్పించారు. రెడ్డి కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. ఆయన వెంట కొండల కొండారెడ్డి, ఎల్లేటి మోహన్ ఉన్నారు.

వాహనాల తనిఖీ

వై.రామవరం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని పి.ఎర్రగొండ ప్రధాన రహదారిలో వై.రామవరం పోలీసులు గురువారం వాహనాల తనిఖీ న్విహించారు. ఎస్ఐ రామకృష్ణ పలు వాహనాలు తనిఖీ చేసి అనుమానిత వ్యక్తులను ప్రశ్నించారు. గంజాయి రవాణాపై ప్రత్యేక నిఘా పెట్టినట్లు తెలిపారు. సైబర్ నేరాలు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. వాహనాల రికార్డులు పరిశీలించారు. తనిఖీల్లో ట్రైనీ ఎస్ఐలు సురేష్, చక్రధర్, సిబ్బంది పాల్గొన్నారు.

పెంచిన గ్యాస్, పెట్రోల్ ధరలు తగ్గించాలి

ఎటపాక, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): పెంచిన వంటగ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను కేంద్రం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ గురువారం గుండాలకాలనీ గ్రామంలో సీపీఎం ఆధ్వర్యంలో మహిళలు నిరసన చేపట్టారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఐవీ పాల్గొని మాట్లాడారు. వంట గ్యాస్, డీజిల్, పెట్రోల్ ధరలు పెంచి పేదల నడ్డి విరుస్తోందన్నారు.

పోలవరం సమస్యపై స్పందించిన ఎమ్మెల్యే

కూనవరం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): కాచవరం, పోచవరం గ్రామాలను పోలవరం 41.15మీటర్ల మొదటి కాంటూరులో చేర్చాలని, 2006లో వచ్చిన గోదావరి వరద లెక్కల ప్రకారం ఆ గ్రామాలను మరూన్ గ్రామాలుగా ప్రకటించాలని, ఈగ్రామాలకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇప్పించాలని కోరుతూ గురువారం అరకు పార్లమెంటు తెలుగు యువత అధికార ప్రతినిధి గడేసుల రంజిత్ కుమార్ ఆధ్వర్యంలో రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవిని కలిశారు. దీనిపై ఎమ్మెల్యే స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి సాధ్యాసాధ్యాలను పరిశీలించాలన్నారు. ఈవిషయాన్ని మంత్రి నిమ్మల రామానాయుడితో మాట్లాడి సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎం.రామారావు, సర్పంచ్ శీలం నాగేశ్వరరావు, కొర్రపాటి శివాజీ, మడెం సాయి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి సిబ్బంది సమస్యలపై నేడు పాడేరులో ర్యాలీ

వై.రామవరం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోరుతూ పాడేరులో ర్యాలీ చేస్తున్నట్లు ఏపీవో సాయిబాబుకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో వివిధ హోదాల్లో పనిచేస్తోన్న సిబ్బంది తెలిపారు. ముందస్తు సమాచారం కోసం ఎంపీడీవో బాపన్నదొరకు, ఏపీవోతో సహా పలువురు వినతిపత్రాలు అందజేశారు.

మహిళల హక్కులపై అవగాహన



న్యాయవాదికి జ్ఞాపిక అందజేస్తున్న దృశ్యం

గండేపల్లి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరంపాలెం ప్రగతి ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం మహిళల హక్కులు, సాధికారత, కార్యాలయ వేధింపులు, వివక్షతను నివారించడంపై అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు కళాశాల చైర్మన్ డాక్టర్ పి.కృష్ణారావు తెలిపారు. అందరికీ గౌరవప్రదమైన కార్యాలయాన్ని సృష్టించడం అనేది కేవలం ఒక విధానం కాదు అందరికీ గౌరవం, సమానత్వం, న్యాయంపట్ల నిబద్ధతనివ్వడమేనని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రముఖ న్యాయవాది ఎన్.సునీత విచ్చేసి మాట్లాడారు. అనంతరం ఆమెకు కళాశాల యాజమాన్యం జ్ఞాపిక అందించారు. కార్యక్రమంలో మేనేజ్‌మెంట్ డైరెక్టర్ ఎం.వి.హరనాథబాబు, వైస్ ప్రెసిడెంట్ ఎం.సతీష్, డైరెక్టర్ అకడమిక్స్ డాక్టర్ కె.సత్యనారాయణ, ప్రిన్సిపాల్ డాక్టర్ జి.నరేష్ పాల్గొన్నారు.

మహిళా మార్టు సందర్శన



మార్టులో వివరాలు అడుగుతున్న దృశ్యం

కిర్లంపూడి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): స్థానిక రమణయ్యపేటలో కిర్లంపూడి గ్రామైక్య సంఘం 2లో వార్షిక రుణ, జీవనోపాదుల ప్రణాళికలు తయారీ విధానంను గురువారం డీఆర్‌డీఏ పథకం సంచాలకులు జి.శ్రీనివాసులు పరిశీలించారు. అనంతరం మార్టును సందర్శించారు. మార్టులో సేల్స్ పెంచేందుకు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఏపీఎం వేదకుమారి, సీసీలు బుల్లియ్య, సత్యప్రసాద్, వీవోఏ సరస్వతి, సంఘ సభ్యులు, తదితరులు ఉన్నారు.

ఏలేశ్వరంలో మజ్జిగ పంపిణీ



మజ్జిగ పంపిణీ చేసున్న పీపీపీ సంఘ సభ్యులు

ఏలేశ్వరం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): వేసవిలో బాటసారుల దాహార్తి తీర్చడమే లక్ష్యంగా ప్రతీ గురువారం దాతల సహాయంతో మజ్జిగ పంపిణీ చేస్తున్నట్లు పీపీపీ సంఘం అధ్యక్షుడు సఖిరెడ్డి విజయబాబు తెలిపారు. గురువారం స్థానిక మెయిన్ రోడ్డులో లయన్స్‌క్లబ్ సభ్యులు జ్యోతుల నాగ సత్య శ్రీనివాస్ ధన సహాయంతో బాటసారులకు అందజేశారు. ప్రకృతి పర్యావరణపరిరక్షణ సంఘం సభ్యులు గోళ్ల నాగేశ్వరరావు, డీవీవీ సత్యనారాయణ, దువ్వా సూరిబాబు, తాళ్లూరి గొల్లాజీ, వరుపుల తిరగటి సత్యనారాయణ, సిరిపురపు బాబూరావు, రౌతు సహదేవుడు, కోరాడ నారాయణరావు పాల్గొన్నారు.

శరణాలయ వృద్ధులకు అన్నదానం

ప్రత్తిపాడు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు పాదాలమ్మ గుడివద్ద గల శారదా వయోవృద్ధ శరణాలయ వృద్ధులకు ఒమ్మంగికి చెందిన మామిడి నరసింహమూర్తి కుటుంబీకులు గురువారం అన్నదానం నిర్వహించారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా మామిడి నరసింహమూర్తి, అనంతలక్ష్మి కుటుంబ సభ్యులు వృద్ధులకు అన్నదానం చేశారు. అనంతరం పాదాలమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.